




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు









సంపుటి : 11 సంచిక : 339 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 13 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :339 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 13 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## ప్రపంచంలో అత్యుత్తమ నివాస నగరంగా
# అమరావతి నిర్మాణం జరగాలి

- అమరావతి నిర్మాణంపై సీఎం చంద్రబాబు సమీక్ష
- అధికారులకు దిశానిర్దేశం చేసిన చంద్రబాబు
- గత ప్రభుత్వంలో ఇసుకనూ ఎత్తుకెళ్లారని సీఎంకు కాంట్రాక్టర్ల ఫిర్యాదు
- రైతుల ప్లాట్ల బదిలీ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామన్న మంత్రి నారాయణ



పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతి సహా, వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీఆర్డీఏ, ఏడీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి పి.నారాయణ, పురపాలక, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులతో పాటు రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ప్రపంచంలో అత్యుత్తమ నివాస నగరంగా అమరావతి నిర్మాణం జరగాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానిలో ఎల్పీఎస్ లే అవుట్లలో అభివృద్ధి పనుల పురోగతి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఉద్యోగులు, న్యాయమూర్తుల నివాస భవనాలు, రహదారులు, డక్ట్ లు లాంటి ట్రంక్ ఇన్ఫ్రా, వరద నియంత్రణ పనులు జరుగుతున్న తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. రాజధానిలో ప్రస్తుతం ప్రస్తుతం రూ.50,552 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని 74 పనులు ప్రారంభమయ్యా యని అధికారులు సీఎంకు వివరించారు. కాంట్రాక్టు సంస్థలు ఆయా పనుల్ని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అయితే నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని తేల్చి చెప్పారు. రాజధానిలో చేపడుతున్న నిర్మాణ పనుల ప్రగతి ప్రజలకు కనిపించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ నెలా అమరావతి పనుల పురోగతిపై సమీక్ష చేస్తానని సీఎం అన్నారు. సమయం ప్రకారం పనులు పూర్తి కాకపోతే ఎందుకు కాలేదన్న అంశంపై సదరు కాంట్రాక్టు సంస్థతో పాటు అధికారులు కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. దీంతో పాటు రియల్ టైమ్ లో పనుల పురోగతిని కూడా పర్యవేక్షిస్తామని సీఎం స్పష్టం చేశారు. ఆటో పైలట్ మోడ్ లో పనులు జరగాలని సూచించారు.

**రైతులకు ఇబ్బంది లేని రీతిలో ప్లాట్ల బదిలీ**

రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో రాజధాని రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయంలో రైతుల విజ్ఞప్తులను పరిశీలించి మాస్టర్ ప్లాన్ కూడా ప్రభావితం

వివరాలు 2లో..

## ఏపీలో 31 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం..

- ఆంధ్రప్రదేశ్‌లో 31 కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం
- నామినేటెడ్ పదవులను భర్తీ చేసిన ఎన్డీయే ప్రభుత్వం
- మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు కీలక బాధ్యతలు
- వివిధ సామాజిక వర్గాలకు సమ ప్రాధాన్యం కల్పిస్తూ నియామకాలు
- ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ.. పూర్తి జాబితా విడుదల

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసింది. ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన నేతలకు తగిన గుర్తింపునిస్తూ, వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. ఈ మేరకు 31 మందితో కూడిన

వివరాలు 2లో..

## పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేసి మళ్లీ జరపాలి



- పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో తీవ్ర అక్రమాలు జరిగాయన్న జగన్
- అధికారాన్ని దుర్వినియోగం చేసి చంద్రబాబు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆరోపణ
- పోలీసులే దగ్గరుండి టీడీపీ దౌర్జన్యాలకు కాపలా కాశారని విమర్శ
- ఈ ఎన్నికలను రద్దు చేసి, కేంద్ర బలగాల పర్యవేక్షణలో తిరిగి నిర్వహించాలని డిమాండ్
- అక్రమాలపై ఆధారాలతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వెల్లడి
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ఈ రోజు ఒక బ్లాక్ డే అని వ్యాఖ్య

వివరాలు 2లో..

## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను తీవ్రవాద సంస్థగా ప్రకటించండి

- కార్నీ ప్రభుత్వానికి కన్జర్వేటివ్ పార్టీ లేఖ
- ఈ గ్యాంగ్ సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తోందని లేఖ
- నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తోందని, కెనడా పౌరులను దోచుకుంటోందని ఆందోళన

వివరాలు 2లో..



## పులివెందులలో 30 ఏళ్ల తర్వాత
# ప్రజాస్వామ్యం గెలిచింది

- పులివెందులలో 30 ఏళ్లలో తొలిసారి ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేశారన్న లోకేశ్
- భయపెట్టి ఏకగ్రీవాలు చేసుకోవడం ప్రజాస్వామ్యం కాదని హితవు
- ఓటు హక్కు వినియోగించుకున్న పులివెందుల ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన లోకేశ్



పెన్ పవర్ డెస్క్: పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ జరిగింది. దీనిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పులివెందులలో ఈసారి జరిగిన ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని తెలిపారు. దశాబ్దాల తర్వాత పులివెందుల ప్రజలు ఎలాంటి

వివరాలు 2లో..

## 'కాల్చి పారేస్తా' అన్న పులివెందుల డీఎస్పీపై అంబటి రాంబాబు ఫైర్

- పులివెందుల వైసీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ కార్యకర్తలకు డీఎస్పీ వార్నింగ్
- పోలీసు ఉద్యోగం ఇచ్చింది ప్రజలను కాల్చిపారేయడానికా? అని ప్రశ్నించిన అంబటి
- చంద్రబాబు, డీఐజీ అండగా ఉన్నారని అహంకారమా? అని మండిపాటు
- ఇది డీఎస్పీ అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్య
- వైసీపీ కార్యకర్తల గుండెలు మండిపోతున్నాయన్న అంబటి

వివరాలు 2లో..



## తీవ్ర ఉద్రిక్తతల నడుమ... ముగిసిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ పోలింగ్

- ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత
- జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి సహా నేతలు కేంద్రంలోకి చొరబాటు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు, ఆందోళనకారుల చెదరగొట్టారు
- రెండు నియోజకవర్గాల్లోనూ టీడీపీ, వైసీపీ మధ్య హెూరాహెూరీ పోరు



పెన్ పవర్ డెస్క్:వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానా లకు మంగళవారం జరిగిన ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసిం ది. పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. నిర్ణీత సమయానికి క్యూలైన్లలో నిలబడి ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే

వివరాలు 2లో..

## ధోనీ రూ.100 కోట్ల పరువు నష్టం కేసులో కదలిక...
# విచారణకు హైకోర్టు ఆదేశం!

- ధోనీ వేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావాలో కీలక పరిణామం
- పదేళ్ల తర్వాత కేసు విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మద్రాస్ హైకోర్టు
- ధోనీ వాంగ్మూలాన్ని రికార్డు చేసేందుకు అడ్వకేట్ కమిషనర్ నియామకం
- 2013 ఐపీఎల్ బెట్టింగ్ వివాదంపై మీడియా కథనాలపై ఈ దావా
- అక్టోబర్, డిసెంబర్‌లో క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరుకానున్న ధోనీ



పెన్ పవర్ డెస్క్:భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావా కేసులో కీలక ముందడుగు పడింది. దాదాపు దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసు విచారణను వేగవంతం చేస్తూ మద్రాస్ హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 2లో..

## గుజరాత్ లోని రిలయన్స్ రిఫైనరీని టార్గెట్ చేస్తాం



- రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామన్న పాక్ ఆర్మీ చీఫ్
- అమెరికా పర్యటనలో జనరల్ అసీమ్ మునీర్ వివాదాస్పద వ్యాఖ్యలు
- ఇది అణు బెదిరింపేనని తీవ్రంగా స్పందించిన భారత విదేశాంగ శాఖ
- ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాఖ్యలు

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ తన అమెరికా పర్యటనలో భారత్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ కవ్వింపులకు పాల్పడుతున్నారు. గుజరాత్‌లోని జామ్‌నగర్ లో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) రిఫైనరీని లక్ష్యంగా చేసుకుంటామని

వివరాలు 2లో..

## సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్... దేశ సగటు కంటే 10 రెట్లు ఎక్కువ!

- సైబర్ నేరాల్లో దేశంలోనే తెలంగాణకు అగ్రస్థానం
- జాతీయ సగటు కంటే పది రెట్లు అధికంగా క్రైమ్ రేటు
- వెల్లడించిన జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ)
- జాబితాలో రెండో స్థానంలో నిలిచిన మరో దక్షిణాది రాష్ట్రం కర్ణాటక
- ఏపీలో 4.4 శాతంగా నమోదైన సైబర్ క్రైమ్ రేటు
- నేరాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు



పెన్ పవర్ డెస్క్: సైబర్ నేరాల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా అప్రతిష్ఠను మూటగట్టుకుంది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ క్రైమ్ రేటుతో పోలిస్తే తెలంగాణలో దాదాపు 10 రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ షాకింగ్ విషయాలను జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) మంగళవారం విడుదల

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పవన్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నారా? ఇక క్యాడర్ కు పండగేనా?

జనసేన పార్టీ అధినేత ఇక వేగం పెంచుతున్నట్లు కనిపిస్తుంది. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఇప్పటి వరకూ ఒక లెక్క. ఈ నాలుగేళ్లు మరొక లెక్క. జమిలి ఎన్నికలు జరిగితే ముందుగానే ఎన్నికలు వస్తాయి. మరోసారి అధికారంలోకి రావాలన్న కసితో పవన్ కల్యాణ్ ఉన్నారు. ఏడాది కాలంగా తన మంత్రిత్వ శాఖకే పరిమితమవుతూ దానిపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. పెద్దగా పార్టీని కూడా పట్టించుకోలేదు. అదే సమయంలో కాపు సామాజికవర్గానికి కూడా తాను ఎటువంటి ప్రయోజనం అధికారంలోకి వచ్చిన తర్వాత చేయలేదు. కేవలం తన మంత్రిత్వ శాఖను అర్థం చేసుకునేందుకే ఇంత సమయం పవన్ కల్యాణ్ తీసుకున్నారని చెబుతున్నారు.

**మంత్రిత్వ శాఖపైనే...**

తొలిసారి మంత్రిగా బాధ్యతలను చేపట్టడం అందులో ఫెయిల్ కాకూడదన్న భావనతోనే పవన్ జనానికి, క్యాడర్ కు దూరంగా ఉన్నారంటున్నారు. ఇక హనీమూన్ పీరియడ్ ముగియడంతో పాటు పవన్ పనితీరుపై విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. జనసేన నేతలు కూడా సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. తాము అప్పుల పాలయ్యామని, తమకు కనీసం పదవులు కూడా దక్కడం లేదని, కనీసం తమకు కూటమి పార్టీల్లో గౌరవం కూడా సరిగా దక్కడం లేదన్న అసంతృప్తితో ఉన్నారు. అందుకే పవన్ కల్యాణ్ పై గతంలో విమర్శలు చేస్తే వెంటనే సోషల్ మీడియా ద్వారానో, మీడియా సమావేశాలు పెట్టి ఖండించే వారు. కానీ గత కొద్ది రోజులుగా మాత్రం మౌనంగా ఉంటున్నారు.

**అసలుకే ఎసరు అని...**

ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే నాలుగేళ్లలో పార్టీ బలోపేతం మాట దేవుడెరుగు? అసలుకే ఎసరు వస్తుందని భావించి పవన్ కల్యాణ్ ఇక నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో సమావేశమవ్వడానికి నిర్ణయించుకున్నారు. నియోజకవర్గాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకోవడం మాత్రమే కాకుండా వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కూడా పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అదే సమయంలో కూటమి పార్టీలో కేర్ చేయని నియోజకవర్గాలను గుర్తించి అక్కడ పర్యటించేందుకు కూడా ప్లాన్ చేసుకుంటున్నట్లు సమాచారం. తద్వారా అక్కడి నేతల్లో జోష్ నింపడమే కాకుండా తెలుగుదేశం పార్టీ నేతలకు కూడా పరోక్ష హెచ్చరికలు జారీ చేయవచ్చని భావిస్తున్నారు.

**ఈ ప్రతిపాదనలతో...**

దీంతోపాటు మరో ప్రతిపాదనను కూడా చంద్రబాబు నాయుడు ముందు పవన్ కల్యాణ్ పెట్టే అవకాశముందని తెలిసింది. వరసగా అనేక నియోజకవర్గాల నుంచివస్తున్న ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని ప్రతి మూడు నెలలకు ఒకసారి కూటమి పార్టీల అగ్రనేతల ఉమ్మడి సమావేశం నిర్వహించాలని కూడా చంద్రబాబును కోరనున్నట్లు తెలిసింది. కనీసం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూడా జనసేన నేతలను కొందరు టీడీపీ నేతలు అడ్డుకుంటుండటంతో అటువంటి విషయాలను కూడా చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వాటిని వెంటనే పరిష్కరించాలని, అవసరమైతే ఆ నియోజకవర్గాల నేతలను పిలిపించి మాట్లాడాలని కూడా పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. మొత్తం మీద పవన్ కల్యాణ్ తన రూటు మార్చి వెళ్లేందుకు రోడ్డు మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారట.

## ప్రపంచంలో అత్యుత్తమ నివాస నగరంగా అమరావతి నిర్మాణం జరగాలి

- మొదటి పేజీ తరువాయి

కాకుండా ఆయా సమస్యల్ని పరిష్కరించాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారాయణ వారం రోజుల్లోగా ఈ అంశాన్ని కొలిక్కి తెస్తామని సీఎంకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో రాజధాని పనులు జరగక పోవటంతో నిర్మాణానికి తెచ్చిన ఇనుము, సామాగ్రి తుప్పు పట్టి పోయిందని కాంట్రాక్టర్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. నిర్మాణం కోసం సేకరించిన ఇసుక నిల్వల్ని కూడా గత పాలకులు ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఇసుకను భర్తీ చేయాల్సిందిగా మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

**భూములు కేటాయించిన సంస్థలకు వేగంగా అనుమతులు**

రాజధాని అమరావతిలో కార్యాలయాల నిర్మాణాలు చేపట్టనున్న వివిధ సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. బిట్స్ పిలానీ, ఎక్స్ ఎల్ఆర్ఐ తదితర సంస్థలకు త్వరితగతిన భూమిని కేటాయించాలని సూచించారు. అలాగే ఇప్పటి వరకూ రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన 72 సంస్థలు ఏమేరకు నిర్మాణాలు చేపడుతున్నాయో నిరంతరం పర్యవేక్షించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సంస్థలకు స్థలం ఇచ్చేస్తేనే పని పూర్తికాదని వీటికి అనుసంధానంగా పెట్టుబడులు, వెంచర్లు కూడా రావాలన్నారు. ఒక్కో ఇటుకా పేరిస్తేనే రాజధాని నిర్మాణం పూర్తి అవుతుందని సీఎం అన్నారు. రాజధాని నగరంలో పెట్టుబడులతో పాటు నగరాభివృద్ధి కూడా జరిగేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. పెద్ద ప్రాజెక్టులను సీబీఎన్ మాత్రమే సమర్ధంగా చేయగలుగుతారని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి గడ్కరీ కూడా చెప్పారని... ఈ క్రెడిబిలిటికి నష్టం కలగకుండా చూడాలన్నారు. అమరావతిలో స్పోర్ట్ సిటీ, పర్యాటక ప్రాజెక్టులు, ఎయిర్ పోర్ట్, బయోటెక్నాలజీ, విద్యాసంస్థలు, ఆసుపత్రులు ఇలా వివిధ రంగాల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు.

## గుజరాత్ లోని రిలయన్స్ రిఫైనరీని టార్గెట్ చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

బెదిరించారు. ఈ రిఫైనరీ ప్రపంచంలోనే అతిపెద్ద సింగిల్–సైట్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌గా గుర్తింపు పొందింది. అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక విందు సమావేశంలో, మునీర్ ఆర్ఐఎల్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ చిత్రంతో పాటు ఖురాన్ శ్లోకాన్ని ప్రస్తావిస్తూ ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ప్రస్తావించారు. అంతేకాదు, భారత్ కు అణు హెచ్చరికలు కూడా చేశారు. అమెరికా నేలపై నుంచి మునీర్ చేసిన ఈ వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ యొక్క యుద్ధోన్మాద వైఖరిని స్పష్టంగా చూపిస్తున్నాయని భారత్ అభిప్రాయపడింది. కాగా, మునీర్ న్యూక్లియర్ వార్నింగ్ నేపథ్యంలో... భారత్, పాకిస్థాన్ దేశాల సైనిక, అణు సామర్థ్యంపై చర్చ మొదలైంది.

**సైనిక బలం: భారత్ ఆధిపత్యం**

ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ ప్రకారం, భారత్ సైనిక బలం పాకిస్థాన్ కంటే చాలా ఎక్కువ. భారత్‌లో సుమారు 14 లక్షల మంది సక్రియ సైనిక సిబ్బంది ఉన్నారు, వీరిలో 12.3 లక్షలు ఆర్మీ, 75,500 నౌకాదళం, 1,49,900 వైమానిక దళం, మరియు 13,350 కోస్ట్ గార్డ్‌లో ఉన్నారు. దీనికి విరుద్ధంగా, పాకిస్థాన్‌లో 7 లక్షల కంటే తక్కువ సైనిక సిబ్బంది ఉన్నారు. 5,60,000 మంది ఆర్మీ, 70,000 మంది వైమానిక దళం, మరియు 30,000 మంది నౌకాదళంలో ఉన్నారు. అంతేకాక, భారత్‌లో 25 లక్షల మంది పారామిలటరీ బలగాలు ఉండగా, పాకిస్థాన్‌లో కేవలం 5 లక్షల మంది మాత్రమే ఉన్నారు.

**న్యూక్లియర్ సామర్థ్యం: భారత్ ముందంజ**

రెండు దేశాలు న్యూక్లియర్ ఆయుధాలను కలిగి ఉన్నప్పటికీ, గత 20 ఏళ్ల గణాంకాలను పరిశీలిస్తే... భారత్‌లో 180 న్యూక్లియర్ వార్‌హెడ్‌లు ఉండగా, పాకిస్థాన్‌లో 170 ఉన్నాయని అంచనా. భారత్ అగ్ని–5 క్షిపణులు బహుళ లక్ష్యాలను ఒకేసారి ఛేదించగల మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్స్ (ఎంఐఆర్‌వీ) సాంకేతికతను కలిగి ఉన్నాయి. అగ్ని–5 రేంజ్ 5,000 నుంచి 8,000 కి.మీ. వరకు ఉండగా, పాకిస్థాన్ యొక్క షాహీన్–3 క్షిపణి రేంజ్ 2,750 కి.మీ. మాత్రమే.

# పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేసి మళ్లీ జరపాలి

పులివెందుల నియోజకవర్గంలోని ఒక చిన్న జడ్పీటీసీ సీటును లాక్కునేందుకు, రాజంపేటలో మరో చిన్న ఒంటిమిట్ట జడ్పీటీసీ సీటును బలవంతంగా చెరబట్టేందుకు ఒక గూండా మాదిరిగా చంద్రబాబు అరాచకాలు చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారంటూ వైసీపీ అధినేత జగన్ ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని రౌడీల రాజ్యం దిశగా నడిపిస్తున్నారని, ముఖ్యమంత్రిగా తనకున్న అధికారాన్ని దుర్వినియోగంచేస్తూ, అధికారులను చెప్పుచేతల్లోకి తీసుకుని, పోలీసులను వాడుకుని, ఈ ఎన్నికను తీవ్రవాదుల మాదిరిగా హైజాక్ చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా గాయపరిచిన ఈరోజు నిజంగా ఒక బ్లాక్ డే అని జగన్ అభివర్ణించారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలను రద్దు చేయాలని, కేంద్ర బలగాల ఆధీనంలో తిరిగి ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

**పోలీసుల సాయంతో రిగ్గింగ్**

చంద్రబాబు ప్రభుత్వం క్షుద్ర రాజకీయానికి తెరలేపిందని జగన్ విమర్శించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా, పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఓటర్లకు దూరంగా మార్చారని ఆరోపించారు. "నిన్న రాత్రి నుంచే బయట ప్రాంతాలకు చెందిన వందలాది మంది టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లోకి చొరబడి, తెల్లవారుజాము నుంచే బూత్‌లను ఆక్రమించుకున్నారు. మా ఏజెంట్లపై, మహిళలపై దాడులు చేసి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి తరిమికొట్టారు. ఓటర్ల నుంచి స్లిప్పులు లాక్కుని దొంగ ఓట్లు వేయించారు," అని జగన్ వివరించారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులే టీడీపీ నేతల అక్రమాలకు దగ్గరుండి కాపలా కాశారని, డీఐజీ కోయ ప్రవీణ్ వంటి అధికారులు ఈ అక్రమాలను ప్రోత్సహించారని ఆయన ఆరోపించారు.

**పాలనలో విఫలమయ్యే ఈ అరాచకాలు**

తన 15 నెలల పాలనలో చంద్రబాబు అన్ని రంగాల్లోనూ విఫలమయ్యారని, ప్రజల మద్దతు కోల్పోయారనే భయంతోనే ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని జగన్ విమర్శించారు. "వ్యవసాయం, విద్య, వైద్యం వంటి రంగాలను నాశనం చేశారు. విద్యార్థులకు ట్యాబులు, విద్యా దీవెన వంటి పథకాలను రద్దు చేశారు. కరెంట్ ఛార్జీల బాదుడు, ఇసుక, మట్టి, లిక్కర్ మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. ఇలాంటి పాలన చేస్తున్న చంద్రబాబుకు ప్రజలు ఎందుకు ఓట్లు వేస్తారు? ఆ నమ్మకం లేదు కాబట్టే ఈ అరాచకాలకు దిగారు," అని ఆయన అన్నారు.

**ఎన్నికలు రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలి**

రెండు చిన్న జడ్పీటీసీ స్థానాల కోసం ఇంతగా దిగజారాల్సిన అవసరం ఏముందని జగన్ ప్రశ్నించారు. 2017 నంద్యాల ఉప ఎన్నికలో కూడా ఇలాగే అక్రమాలు చేసి గెలిచినా, ఏడాదిన్నర తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు టీడీపీని చిత్తుగా ఓడించారని గుర్తుచేశారు. పులివెందుల ప్రజలు కూడా భవిష్యత్తులో చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ ఎన్నికల అక్రమాలపై తమ వద్ద ఉన్న ఆధారాలతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ ఈ అన్యాయాన్ని నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'కాల్చి పారేస్తా' అన్న పులివెందుల డీఎస్పీపై అంబటి రాంబాబు ఫైర్

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలు ముగిశాయి. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లను మాత్రమే ఓటు వేసేందుకు లోపలకు అనుమతించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత మధ్య కడపకు తరలించనున్నారు. మరోవైపు, పోలింగ్ జరగుతున్న సమయంలో పులివెందులలోని వైసీపీ కార్యాలయానికి ఆ పార్టీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి వచ్చారు. ఈ క్రమంలో అవినాశ్ ను పోలీసులు వైసీపీ కార్యాలయంలోనే నిర్బంధించారు. దీంతో, అక్కడకు పెద్ద సంఖ్యలో చేరుకున్న వైసీపీ కార్యకర్తలు హంగామా సృష్టించారు. ఈక్రమంలో అక్కడి నుంచి వెళ్లిపోవాలని కార్యకర్తలను డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశించారు. దీంతో, వైసీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో, అక్కడే ఉన్న పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ వైసీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాల్చిపడేస్తా నా కొ..కా.. నువ్వు తాగి మాట్లాడొద్దు... ఏమనుకుంటున్నావ్.. యూనిఫాం ఇక్కడ" అంటూ గట్టిగా హెచ్చరించారు. డీఎస్పీ వ్యాఖ్యలపై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఫైర్ అయ్యారు. పోలీసు ఉద్యోగం ఇచ్చింది ప్రజలను కాల్చిపారేయడానికా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డీఐజీ ప్రవీణ్ అండగా ఉన్నారని అహంకారమా? అని మండిపడ్డారు. కార్యాలయంలో ఓవైపు ఎంపీ ఉండగానే... బయట కార్యకర్తలను కాల్చిపారేస్తాను అనడం డీఎస్పీ అహంకారానికి నిదర్శనమని అన్నారు. టీడీపీని గెలిపించడానికే ఖాకీ దుస్తులు వేసుకున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాకీ బదులు పచ్చ చొక్కాలు వేసుకుంటే బాగుంటుందని ఎద్దేవా చేశారు. కేవలం రెండు జడ్పీటీసీల కోసం చంద్రబాబు ఇంత దారుణాలకు ఒడిగట్టాలా? అని అంబటి ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబు వందేళ్ల వెనుకకు తీసుకెళ్లారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రారంభించిన ఈ సంప్రదాయం ఆయనను, ఆయన కుమారుడిని వెంటాడదా? అని వ్యాఖ్యానించారు. ఈరోజు జరిగిన పరిణామాలతో వైసీపీ కార్యకర్తల గుండెలు మండిపోతున్నాయని చెప్పారు.

## ఏపీలో 31 కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం..

- మొదటి పేజీ తరువాయి

జాబితాను ప్రభుత్వం మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తూ ఈ నియామకాలు చేపట్టడం గమనార్హం. ఈ పదవుల కేటాయింపులో ప్రభుత్వం బీసీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించింది. మొత్తం 31 పోస్టులలో 17 పదవులను బీసీలకే కేటాయించి సామాజిక న్యాయం పట్ల తమ నిబద్ధతను చాటుకుంది. వీరితో పాటు ఓసీ వర్గానికి 6, ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, మైనార్టీలకు 2 చొప్పున పదవులను కేటాయించారు. ఈ నియామకాల ద్వారా అన్ని వర్గాలకు సమ ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం చేసినట్లు స్పష్టమవుతోంది. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలకు కూడా ఈ జాబితాలో సముచిత స్థానం కల్పించారు.

## ధోనీ రూ.100 కోట్ల పరువు నష్టం కేసులో కదలిక... విచారణకు హైకోర్టు ఆదేశం!

- మొదటి పేజీ తరువాయి

విచారణలో భాగంగా ధోనీ వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు ప్రత్యేకంగా ఒక అడ్వకేట్ కమిషనర్‌ను నియమిస్తున్నట్లు కోర్టు ప్రకటించింది.

**విచారణకు అడ్వకేట్ కమిషనర్**

జస్టిస్ సీవీ కార్తికేయన్ ఈ కేసుపై విచారణ జరిపారు. కేసు విచారణను వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు, ధోనీ వాంగ్మూలంతో పాటు ఇతర సాక్ష్యాధారాలను నమోదు చేయడానికి అడ్వకేట్ కమిషనర్‌ను నియమించారు. దీనివల్ల అనవసర జాప్యం నివారించవచ్చని న్యాయస్థానం అభిప్రాయపడింది. క్రాస్ ఎగ్జామినేషన్ కోసం ఈ ఏడాది అక్టోబర్ 20, డిసెంబర్ 10 తేదీల్లో తాను అందుబాటులో ఉంటానని ధోనీ తరఫున కోర్టుకు తెలిపారు. విచారణకు పూర్తిగా సహకరిస్తానని, కోర్టు, కమిషనర్ సూచనలను పాటిస్తానని ఆయన తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

**కేసు పూర్వాపరాలు**

2013లో ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్, బెట్టింగ్ కుంభకోణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ వివాదంపై కొన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టులు టీవీ చర్చల్లో తనపై నిరాధారమైన వ్యాఖ్యలు చేశారని, తన ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగించారని ఆరోపిస్తూ ధోనీ 2014లో ఈ పరువు నష్టం దావా వేశారు. తన పరువుకు నష్టపరిహారంగా రూ.100 కోట్లు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కుంభకోణం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లపై రెండేళ్ల నిషేధం పడింది. సీఎస్‌కే అధికారి గురునాథ్ మీయప్పన్, రాజస్థాన్ రాయల్స్ యజమాని రాజ్ కుంద్రా వంటి ప్రముఖులపై ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ వివాదంలో ధోనీపై వ్యక్తిగతంగా ఎలాంటి ఆరోపణలు లేనప్పటికీ, మీడియా కథనాలు హద్దులు దాటాయని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తాజాగా హైకోర్టు ఆదేశాలతో, పదేళ్లుగా నలుగుతున్న ఈ కేసు విచారణ త్వరగా పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

## పులివెందులలో 30 ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యం గెలిచింది

- మొదటి పేజీ తరువాయి

భయాలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వ్యాఖ్యానించారు. గత 30 సంవత్సరాలుగా పులివెందులలో భయానక వాతావరణం ఉండేదని, కానీ ఈ ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఓటు వేయడం గొప్ప మార్పుకు సంకేతమని లోకేశ్ పేర్కొన్నారు. స్వేచ్ఛగా ఓటు వేసిన పులివెందుల ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ వైఖరిని ఎండగడుతూ, "వైసీపీ మూర?త్వానికి మరణం లేదని మరోసారి రుజువైంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలను సక్రమంగా నిర్వహించడమే తప్ప, ప్రజలను భయపెట్టి ఏకగ్రీవాలు చేసుకోవడం కాదని ఆయన స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిందని, ప్రస్తుతం ప్రజలు నిర్భయంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించగలుగుతున్నారని లోకేశ్ పేర్కొన్నారు.

## తీవ్ర ఉద్రిక్తతల నడుమ... ముగిసిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ పోలింగ్

- మొదటి పేజీ తరువాయి

అవకాశాన్ని కల్పించారు. పులివెందులలో 15 పోలింగ్ కేంద్రాలు, ఒంటిమిట్టలో 30 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికే పులివెందులలో 71.36 శాతం, ఒంటిమిట్టలో 66.39 శాతం ఓటింగ్ నమోదైంది.

ఈ ఉప ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లోనూ అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య గట్టి పోటీ కనిపించింది. పులివెందులలో టీడీపీ తరఫున బీటెక్ రవి అర్ధాంగి మారెడ్డి లతారెడ్డి, వైసీపీ తరఫున హేమంత్‌రెడ్డి ప్రధాన అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఒంటిమిట్టలో టీడీపీ నుంచి ముద్దు కృష్ణారెడ్డి, వైసీపీ నుంచి ఇరగం రెడ్డి పోటీ పడ్డారు. రెండు చోట్లా మొత్తం 11 మంది చొప్పున అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు.

కాగా, ఒంటిమిట్టలో పోలింగ్ సందర్భంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేనమామ కె. రవీంద్రనాథ్ రెడ్డి తన అనుచరులతో కలిసి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న బారికేడ్లు, కుర్చీలను తోసివేయడంతో అక్కడ గందరగోళం చెలరేగింది. వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది, పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వైసీపీ నేతలను చెదరగొట్టి, పోలింగ్ ప్రశాంతంగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు.

## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను తీవ్రవాద సంస్థగా ప్రకటించండి

కెనడాలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కోరుతూ కన్జర్వేటివ్ పార్టీ తాజాగా మార్క్ కార్నీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ గ్యాంగ్ సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, వీరిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

కెనడాలో బిష్ణోయ్ గ్యాంగ్ ఆగడాలు పెరుగుతున్నాయంటూ స్థానికంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కపిల్ శర్మ కేఫ్‌పై రెండుసార్లు కాల్పులు జరగడం తీవ్ర కలకలం రేపింది. ఈ కాల్పుల్లో బిష్ణోయ్ గ్యాంగ్ పాత్ర ఉందనే వాదనలు వినిపించాయి. ఈ నేపథ్యంలో లారెన్స్ బిష్ణోయ్ సంస్థను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కన్జర్వేటివ్ పార్టీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తోందని, కెనడా పౌరులను దోచుకుంటోందని, హత్య కేసుల్లో వారి ప్రమేయం ఉందని కెనడా ఎంపీ ఫ్రాంకా కాపుటో ఆ లేఖలో పేర్కొన్నారు. స్థానికంగా, విదేశాల్లో పలు హింసాత్మక ఘటనలకు తామే బాధ్యులమని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుందని గుర్తు చేశారు. రాజకీయ, మతపరమైన, సైద్ధాంతిక కారణాలతో ఈ గ్యాంగ్ అనేక సాంఘిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందని, ఈ అంశాలన్నీ వారిని ఉగ్రవాద సంస్థ జాబితాలో చేర్చడానికి తగిన కారణలని లేఖలో పేర్కొన్నారు. తద్వారా వీరి కార్యకలాపాలను అణిచివేసేందుకు భద్రతా సంస్థలకు అవకాశం ఉంటుందని తెలిపారు. బిష్ణోయ్ గ్యాంగ్ కార్యకలాపాలపై పలువురు కెనడా రాజకీయ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. బ్రాంప్టన్ మేయర్ పాట్రిక్ బ్రౌన్ సహా నలుగురు కెనడియన్ నేతలు గతంలో ఇలాంటి విజ్ఞప్తులు చేశారని తెలిపారు. బ్రిటిష్ కొలంబియా ప్రీమియర్ డేవిడ్ ఈబే, అల్బెర్టా ప్రీమియర్ డేనియల్ స్మిత్, సర్రే మేయర్ బ్రెండా లాకీలు కూడా బిష్ణోయ్ గ్యాంగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరిన వారిలో ఉన్నారని వెల్లడించారు. ఈ గ్యాంగ్‌పై చర్యలు తీసుకోవడానికి రాజకీయంగా ఏకాభిప్రాయం ఉందని స్పష్టం చేశారు.

## సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్... దేశ సగటు కంటే 10 రెట్లు ఎక్కువ!

- మొదటి పేజీ తరువాయి

చేసిన 2022 మధ్యంతర డేటా వెల్లడించింది.

ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేటు సగటున 4.8 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది 40.3 శాతంగా నమోదైంది. దీంతో ఈ జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రియాశీలంగా ఉన్నట్లు ఈ నివేదిక సూచిస్తోంది. తెలంగాణ తర్వాత కర్ణాటక రెండో స్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాల

విషయానికొస్తే, మహారాష్ట్రలో సైబర్ క్రైమ్ రేటు 6.6 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 4.4, అసోంలో 4.9, ఉత్తరప్రదేశ్, ఒడిశాలలో 4.3 శాతం చొప్పున ఉంది. పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కేవలం 0.4 శాతం క్రైమ్ రేటుతో మెరుగైన

స్థానంలో నిలవడం గమనార్హం. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీ 3.2 శాతం, పుదుచ్చేరి 3.9 శాతం క్రైమ్ రేటుతో సైబర్ నేరాలకు హాట్‌స్పాట్‌లుగా మారాయి. ఢిల్లీ పోలీసుల డేటా ప్రకారం, 2024లో సైబర్ మోసాల ద్వారా ఢిల్లీ వాసులు రూ. 817 కోట్లు నష్టపోయారు. 2025లో జూన్ 30 నాటికి మొదటి ఆరు నెలల్లోనే రూ. 70.64 కోట్లు కోల్పోయారు.

దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభకు తెలిపారు. ఇందులో భాగంగా 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (I4C) ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' (cybercrime.gov.in) ప్రారంభించామని వివరించారు. దీంతో పాటు, మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు పోలీస్ విభాగాల్లో ప్రత్యేక యూనిట్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

కడప జిల్లాకు చెందిన సి.ఆర్.అసోసియేట్స్ సంస్థ అధినేత శ్రీ చరణ్ తేజ్ టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.10,10,116 విరాళంగా అందించారు.



పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా



## ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి

– మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**బనగానపల్లి పెన్ పవర్ ఆగస్టు 12 :** క్షేత్ర స్థాయి ప్రజల నుంచి వచ్చే సమస్యలు, వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను రాష్ట్ర రోడ్లు & భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు.. నేటి మధ్యాహ్నం బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రత్యక్షంగా స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని బాధితులకు మంత్రి హామీ ఇవ్వడం జరిగింది. అలాగే చట్టబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో మంత్రి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్ లో మాట్లాడి ఆయా సమస్యలకు పరిష్కరించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో బాధితుల నుంచి సంతోషం వ్యక్తమైంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.



## ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలి

### 1.1 కిలోమీటర్ల పొడవు తిరంగా ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 12 :** ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తిని చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరం లోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్ జోసెఫ్ కళాశాల నుండి కొండారెడ్డి బురుజు వరకు 2,800 మంది సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థుల చే 1.1 కిలోమీటర్ల పొడవు గల మువ్వన్నెల జెండా ప్రదర్శనా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా ప్రదర్శనలో భాగంగా నిర్వాహకులు గ్లోబల్ టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ ఖాజా మాలిక్, సెయింట్ జోసెఫ్ కళాశాల సిబ్బంది, విద్యార్థుల సహకారంతో 1.1 కిలోమీటర్ల పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించడం జరుగుతోందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత భావాలు కలుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 15 వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. భారతదేశంలో ఇంతకు మునుపు గుజరాత్ రాష్ట్రంలో పొడవైన జాతీయ జెండాను ప్రదర్శించారని, ఇప్పుడు కర్నూలులో అంతకంటే పొడవైన 1.1 కిలోమీటర్ల పొడవు జాతీయ జెండాను ప్రదర్శించి, వరల్డ్ రికార్డ్స్ ఇండియా లో స్థానం సంపాదిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని రికార్డు చేసేందుకు వరల్డ్ రికార్డ్స్అఫ్ ఇండియా కు చెందిన రిప్రజెంటేటివ్ వచ్చారని కలెక్టర్ తెలిపారు. ప్రదర్శనలో మూడు, నాలుగు సంవత్సరాల వయసుగల చిన్న పిల్లలు భారత మాత, సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ,జవహర్ లాల్ నెహ్రూ, స్వామి వివేకానంద,అల్లూరి సీతారామరాజు తదితర స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో పాల్గొని అందరినీ



ఆకర్షించారు. ఈ సందర్భంగా ఎన్ సిసి విద్యార్థుల నుండి జిల్లా కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. తిరంగా ప్రదర్శనలో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, ఖాజా మాలిక్ (గ్లోబల్ టౌన్ షిప్ మేనేజింగ్ డైరెక్టర్), పవన్ సోలంకి (వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ఇండియా రెప్రజెంటేటివ్), సెయింట్ జోసెఫ్ కళాశాలకు చెందిన డీన్(అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) శ్రీమతి శౌరీలు రెడ్డి ప్రిన్సిపల్ శాంత, కళాశాల సిబ్బంది, ఎన్సిసి విద్యార్థులు, సెయింట్ జోసెఫ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.









## దేశ అభివృద్ధి యువత చేతుల్లోనే

### – క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు




**కర్నూలు పెన్ పవర్ ఆగస్టు 12 :** జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్కూరు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు మరియు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ యువత తోనే దేశ అభివృద్ధి జరుగుతుందని, దేశ అభివృద్ధికి దృఢ సంకల్పంతో యువత ముందుకు నడవాలని కోరారు, స్థానిక యువత, ప్రపంచ మరియు దేశ అభివృద్ధి ఆశయాలను అనుగుణంగా సమాజ–ఆధారిత వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక పాత్రను పోషించాలని, జాతీయ మరియు అంతర్జాతీయ నిబద్ధతలతో స్థిరత్వాన్ని కొనసాగిస్తూ సమాజ అవసరాలతో వాటిని సమలేఖనం చేయాలని కోరారు. అలాగే స్వాతంత్ర సమర యోధుల త్యాగాలను వమ్ము కాకుండా, వారి ఆశయాలకు అనుగుణగా నడవాలి అని పిలుపునిచ్చారు. తదుపరి కళాశాల ప్రిన్సిపాల్ డా శ్రీనివాస్ మాట్లాడుతూ యువత యుక్త వయసులో అనవసర కార్యక్రమాలకు సమయం వృధా చేయకుండా స్థిరమైన లక్ష్యాలు ఏర్పరుచుకొని, క్రమ శిక్షణతో, అంకుఠిత దీక్షతో లక్ష్య సాధనకు కృషి చేస్తే యువత తప్పక విజయం సాధించడం సులభమని తెలిపారు. తదుపరి సెట్కూరు సీఈఓ డా!! కె.వేణుగోపాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ యువజన దినోత్సవం నాడు ప్రపంచ వ్యాప్తంగా మన భారత దేశం తో సహా వివిధ దేశాలు యువత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఆచరణలో పెడుతున్నాయని అలాగే యువతలోని సృజనాత్మకథను వెలికి తీసేందుకు వివిధ రకాల సెమినార్లు, పోటీలు నిర్వహిస్తుంటాయని. అందులో భాగంగా ఈరోజూ అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు క్లస్టర్ యూనివర్సిటీలో అనుబంధ మూడు కళాశాలలను భాగస్వామ్యం చేసి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహించిన క్లస్టర్ అనుబంధ కళాశాలలు 1) సిల్వర్ జూబిలీ ప్రభుత్వ కళాశాల, 2) ప్రభుత్వ పురుషల డిగ్రీ కళాశాల, 3) కె.వి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో నిర్వహించిన వక్తృత్వ, డిబేట్ అండ్ గ్రూప్ డిస్కషన్ పోటీల విజేతలకు మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో కె.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రెడ్డి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ సత్యనారాయణ, చైల్డ్ సైకాలజిస్ట్ శ్రీమతి జ్యోతిర్మయి, క్లస్టర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## భూపనపాడు గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**పాణ్యం, పెన్ పవర్ ఆగస్టు 12 :** భూపనపాడు గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పాణ్యం మండలం, భూపనపాడు గ్రామంలో డ్రైనేజీ, సిమెంట్ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ... పాణ్యం మండలం, భూపనపాడు గ్రామంలో డ్రైనేజీ కాలువలు దెబ్బతిని మురికి నీరు అంతా రోడ్లపైకి వస్తుందని రోడ్లు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాయని పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆ గ్రామ ప్రజలు అర్జీ సమర్పించడం జరిగిందన్నారు. దీంతో నేడు భూపానుపాడు గ్రామాన్ని సందర్శించడం జరిగిందని ఈ గ్రామంలో డ్రైనేజీ కాలువలు, సిమెంట్ రోడ్లు నిర్మించి ప్రజలకు ఎటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆ గ్రామ ప్రజలకు కలెక్టర్ తెలిపారు.

**పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీపై వెంటనే స్పందించిన కలెక్టర్ :** ఈనెల 11వ తేదీ సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాణ్యం మండలం, భూపనపాడు గ్రామానికి చెందిన పలువురు ప్రజలు మా గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని అర్జీ సమర్పించడం జరిగింది.

దీంతో వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ 12వ తేదీ మంగళవారం ఉదయం భూపనపాడు గ్రామాన్ని సందర్శించి డ్రైనేజీ, రోడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించడం జరిగింది. దీంతో భూపనపాడు గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తుడా బోర్డు మీటింగ్‌లో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం..




**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 12 :** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మంగళవారం తుడా బోర్డు మీటింగ్ జరిగింది. జిల్లా కలెక్టర్ శ్రీ వెంటేశ్వర్, తుడా చైర్మన్ శ్రీ డాలర్స్ దివాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీ శుభం బన్సల్,తుడా సెక్రటరీ శ్రీ ఎన్వి శ్రీకాంత్ బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టౌన్ అండ్ సిటీ ప్లానింగ్ డైరెక్టర్ శ్రీ విద్యులత, ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ శ్రీ శివయ్య, పురపాలక శాఖ మంత్రి ఓ ఎస్ డి శ్రీ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాదాపు 9 అంశాలను కీలకంగా చర్చించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ఆదేశంతో తుడా పరిధిలో ఉన్న దాదాపు 20 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అందులో మొదట విడతగా చెన్నైగుంట, మంగళం, శెట్టిపల్లి చెరువులను 8. 6 కోట్ల రూపాయలతో అభివృద్ధికి ఆమోదం తెలియజేశారు. సూరప్పకసం పద్మావతి నగర్ తుడా లేఔట్స్ నందు చదరపు గజం 14 వేల కనీస ధరగా నిర్ణయించి 13వ విడత వేలంకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. శెట్టిపల్లి శ్యాటిలైట్ టౌన్షిప్ కోసం ప్రతిపాదించిన ఐదు నూతన రోడ్ల నిర్మాణం ఆమోదం తెలియజేశారు. వీటితోపాటు మరికొన్ని కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.

## ప్రతి ఇంటా జాతీయ జెండాను ఎగురవేయాలి

### – జాయింట్ కలెక్టర్ నవ్య




**కర్నూలు పెన్ పవర్ ఆగస్టు 12 :** యువజన సంక్షేమ శాఖ – సెట్కూరు – క్లస్టర్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో సిల్వర్ జూబిలీ డిగ్రీ కళాశాల నుంచి బిర్లాగేట్ వరకు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో జాయింట్ కలెక్టర్ నవ్య గారు, 28 బెటాలియన్ కల్నల్ ప్రసాద్, క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, సీఈఓ సెట్కూరు డా. కె.వేణుగోపాల్ మొదలగు వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నవ్య గారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలలో దేశ భక్తి పెంపొందించడానికి, మరియు నేటి యువత కు స్వాతంత్రం కొరకు పోరాటం చేసిన యోధుల గురించి తెలియజెసేందుకు వివిధ కార్యక్రమాలు చేపడున్నామన్నామని తెలిపారు.



## ప్రధాని మోడీతో మర్యాదపూర్వకంగా....





**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 12 :** న్యూఢిల్లీలో సోమవారం కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, డా.చంద్రశేఖర్ పెమ్మసాని, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ మరియు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సహచరులతో కలిసి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ప్రధాన మంత్రికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఆపరేషన్ మన దేశ సైనికుల ధైర్యసాహసాలకు నిలువెత్తు నిదర్శనమని, మన జవాన్ల సేవా స్ఫూర్తి ఎల్లప్పుడూ భారత జాతికి గర్వకారణమని పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ తెలిపారు.

## పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

### విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా





**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 12 :** పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. మంగళవారం స్థానిక బి.క్యాంప్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న పిల్లల్లో, బాల బాలికల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణ మయ్యే నులిపురుగులను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు.. నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రతి ఒక్కరు ఆల్బెండజోల్ మాత్రలను వేసుకొని ఆరోగ్యంగా ఉండాల న్నారు. ఈ కార్యక్రమాన్ని సంవత్సరంలో ఫిబ్రవరి, ఆగస్టు నెలలో నిర్వహించడం జరుగుతుందన్నారు... నులిపురుగులు శరీరంలో ఉంటే రక్త హీనత కు గురి కావల్సి వస్తుందని, అందువల్ల విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏదైనా కారణం చేత మాత్రలు అందని విద్యార్థులకు వారు పాఠశాల రాగానే మాత్రలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు.. చదువు మీద శ్రద్ధ పెట్టి చదువుకోడానికి, మెదడు చురుగ్గా పనిచేయడానికి విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్నారు.. ఐరన్ తో కూడుకున్న పౌష్టికాహారాన్ని తీసుకొని రక్తహీనత లేకుండా ఉండాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.. పాఠశాలలో వైద్యులు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించినప్పుడు హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్నట్లయితే, వారికి ఏఎన్ఎం లు ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్ లను ఇస్తున్నారా అని కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు కాంపౌండ్ వాల్ కావాలని పాఠశాల సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ డిఈఓ ను ఆదేశించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. శాంతి కళ, డిఈఓ శామ్యూల్ పాల్, హెడ్ మాస్టర్ మేరీ సునీత తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలకు వచ్చే వాహనాలకు ఫాస్ట్ టాగ్ తప్పనిసరి


**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 12 :** అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద వివిధ వాహనాల్లో చేరుకునే భక్తులకు మెరుగైన భద్రతా ప్రమాణాలు, అధిక రద్దీ నివారణ, పారదర్శక సేవలు అందించే దృష్ట్యా ఆగస్టు 15వ తారీకు నుండి తిరుమలకు వెళ్లే వాహనాలకు ఫాస్ట్ టాగ్ తప్పనిసరి చేయడం జరిగింది. ఇకపై ఫాస్ట్ టాగ్ లేని వాహనాలను తిరుమలకు అనుమతించడం జరగదు. ఫాస్ట్ టాగ్ లేని వాహనదారుల సౌకర్యార్థం అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ఐసిఐసిఐ బ్యాంకు వారి సహకారంతో ఫాస్ట్ టాగ్ జారీ కేంద్రం ఏర్పాటు చేయడం కూడా జరిగింది. ఫాస్ట్ టాగ్ లేని వాహనదారులు ఇక్కడ అతి తక్కువ సమయంలో ఫాస్ట్ టాగ్ సౌకర్యాన్ని పొందిన తరువాత మాత్రమే వారి వాహనాలను తిరుమలకు అనుమతిస్తారని మరొకసారి తెలియజేయడమైనది. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని టీటీడీకి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేయడమైనది.

## ప్రజా సమస్యలే ప్రాధాన్యం : మంత్రి సత్య కుమార్ స్పందన





**ధర్మవరం, పెన్ పవర్ ఆగస్టు 12 :** ధర్మవరం పట్టణంలో త్రాగునీటి సరఫరా సమస్యపై రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణ ప్రజలు ఇబ్బందులు పడకుండా నీటి సరఫరా నిరంతరాయంగా కొన సాగాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో మంత్రి, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఏ.డి., ఈ.ఈ., ధర్మవరం మున్సిపల్ కమిషనర్, ఆయన నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు లను స్వయంగా పార్న పల్లి డ్యాం వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు వారు అక్కడికి చేరుకొని మోటర్లు, వాటి వైరింగ్, మరియు సాంకేతిక లోపాలను సమీక్షించారు. అక్కడ గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా మోటర్లకు సంబంధించిన సాంకేతిక లోపాలను తొలగించి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేసి, పట్టణ ప్రజలకు నిరంతరాయంగా త్రాగునీరు అందించేలా తక్షణం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ,,,, మంత్రి గారి స్పష్టమైన మార్గదర్శకత్వంతో తక్షణమే చర్యలు తీసుకోవడం వల్ల, పట్టణానికి నిరంతరాయంగా నీటి సరఫరా కొనసాగించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి పూర్తవుతున్నాయి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని హరీష్ బాబు స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు అభివృద్ధి కోసం కృషి చేసే నాయకుడు మన సత్య కుమార్ యాదవ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, డి.ఈ. వీరేష్, ఈ.ఈ. సాయి కృష్ణ, ఏ.డి. నరసింహారెడ్డి, బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబులేసు, టిడిపి పట్టణ అధ్యక్షులు పరిశే సుధాకర, మాధవరెడ్డి, తాడిమర్రి మండల అధ్యక్షులు రామ్మోహన్, బిజెపి పట్టణ అధ్యక్షులు చంద్ర, రూరల్ అధ్యక్షులు చంద్ర, అంబటి సతీష్, రవి, తదితరులు పాల్గొన్నారు.





బెంగళూరుకు చెందిన చంద్రశేఖర్ బ్యాటరీ వెహికల్ టీటీడీకి బహూకరణ

## జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్‌ను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్



**కడప పెన్ పవర్ ఆగస్టు 12 :** వైయస్సార్ కడప జిల్లాలో జరుగుతున్న జడ్పిటిసి ఉపఎన్నికల పోలింగ్ నేపథ్యంలో... మంగళవారం పులివెందుల మండలం నల్లపురెడ్డి పల్లె, నల్లగొండువారి పల్లె, ఎర్రబల్లె గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లో పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్. ఈ సందర్భంగా నల్లపురెడ్డి పల్లె పోలింగ్ స్టేషన్ వద్ద మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... ఎక్కడా కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా పోలింగ్ ప్రక్రియ సాగుతుందని తెలిపిన జిల్లా కలెక్టర్. ఇటు పులివెందుల, అటు ఒంటిమిట్ట మండలాల్లో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద సిసి కెమెరాల పర్యవేక్షణ, వెబ్ కాస్టింగ్, మైక్రోఅబ్జర్వర్ల పర్యవేక్షణలో జెడ్పిటీసీ ఉప ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. 11 గంటల సమయానికే.. 40% శాతం పైగా పోలింగ్ నమోదయింది. ఓటర్లు సజావుగా ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ స్టేషన్ వద్ద త్రాగునీరు, మెడికల్ ఎమర్జెన్సీ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపిన జిల్లా కలెక్టర్. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద నలుగురు సిబ్బందితో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అలాగే పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ సౌలభ్యం కోసం ఆయా ప్రాంతాల రూట్లలో నాలుగు ఆర్టీసీ బస్సులను, ఆటోలను నడుపుతున్నట్లు తెలిపిన జిల్లా కలెక్టర్. పులివెందులలోని మొత్తం 15 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి అన్ని భద్రతా చర్యలను ఏర్పాటు చేశామని తెలిపిన జిల్లా కలెక్టర్. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావు లేకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టామని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో కూడా సజావుగా పోలింగ్ జరుగుతోందని తెలిపిన కలెక్టర్. కొన్ని సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను పట్టించుకోకుండా అవగాహనతో ఓటర్లు సంయమనంగా.. ఓటు హక్కును ఉపయోగించు కుంటున్నారన్న జిల్లా కలెక్టర్. సాయంత్రం 5 గంటల లోపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100% పోలింగ్ నమోదవుతుందని, ప్రజలు ప్రశాంతంగా, సజావుగా తమ ఓటు హక్కును వినియోగించు కుంటున్నారని తెలిపిన జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి.



## నల్సా పథకాలపై న్యాయ విజ్ఞాన సదస్సు






**కడప పెన్ పవర్ ఆగస్టు 12 :** గౌరవ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కడప నగరం గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ యువజన దినోత్సవ ప్రాముఖ్యతను, నల్సా (మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు డ్రగ్ మెనాస్ నిర్మూలన బాధితులకు న్యాయ సేవలు) పథకం, 2015 ను వివరించారు, ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు రిజిస్టర్ మెడికల్ వైద్యాధికారి దగ్గరికి వెళ్లాలి ప్రిస్క్రిప్షన్ ప్రకారం డ్రగ్స్ వాడాలి, డ్రగ్స్ మోతాదుకు మించి వాడడం హానికరం, డ్రగ్స్ విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలి, ఆర్టికల్ 47, ద డ్రగ్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ సబ్ స్టాన్సిస్ యాక్ట్ 1985, మాదక ద్రవ్యాలు, హెచ్ఐవి, నల్సా పథకములు, క్యాస్ట్ సర్టిఫికెట్లు, ఇన్కమ్ సర్టిఫికెట్లు, సదరన్ చక్రియలు, రెసిడెన్షియల్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగంశాలపై అవగాహన కలిగించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసి మరియు టిబి అధికారి యస్. రవిబాబు, ప్రిసిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్, క్లస్టర్ ప్రోగ్రమ్మే అధికారి భాస్కర్, ఆర్ ఆర్ సి కోఆర్డినేటర్ నాగరాజు, వైద్యాధికారి సావిత్రి, ఎన్ ఎస్ ఎస్ అధికారి నాగరాజు, ఎన్జీవోలు, లెక్చరర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఏ ఒక్క మాత, శిశు మరణాలు జరగకూడదు

### - ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 12 :** జిల్లాలో ఎక్కడ కూడా ఏ తల్లి బిడ్డకు జన్మినిస్తూ చనిపోకూడదని -ఏ శిశువు జన్మింస్తూ మరణించ కూడదని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఆరోగ్య వైద్య అధికారిణి డాక్టర్ ఈబి.దేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్.యుగంధర్ లతో కలసి ఇన్చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ జిల్లాలో త్రైమాసిక లో కూడేరు,నాగ సముద్రం,విడపనకల్లు, అంబేద్కర్ నగర్ యు పి హెచ్ సి నందు జరిగిన మాతృ మరణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా ఏ తల్లి బిడ్డకు జన్మినిస్తూ చనిపోకూడదని -ఏ శిశువు జన్మింస్తూ మరణించ కుండ వైద్య అధికారు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో 4 మాతృ మరణాలు జరగడానికి గల కారణాలపై ఆ ప్రాంత డాక్టర్స్ ఏ యన్ యం లు, ఆశా కార్యకర్తలు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఎందువల్ల చనిపోయారని వంటి అంశాలపై కలెక్టర్ చర్చించారు. మాతృ మరణం జరిగినప్పుడు మరణానికి ముందు ఏ రకమైన ఇబ్బందులు ఎదురైనాయి, మరణానికి గల కారణాలు తెలుసుకొని మరోసారి అలాంటి కారణంతో మరో మరణం జరగకుండా డాక్టర్స్, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గర్భిణీ స్త్రీ డెలివరీ తరువాత కూడా అత్యంత జాగ్రత్తగా ఆరువారాల నుండి ఆరు నెలలుపాటు తగిన జాగ్రతలు తీసుకోవాలన్న గర్భవతులు, బాలింతకు పూర్తి అవగాహన కల్పించని వైద్య ని ఆదేశించారు. మాతృ మరణాలను నివారించడానికి వైద్య శాఖలో ఉన్న సూపర్వైజర్ సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్ లో మాతృ మరణాలు జరిగిన చోట తానే స్వయంగా వచ్చి విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఐసిడియస్. ప్రాజెక్టు వారు గర్భిణీ స్త్రీలకు అందించే న్యూట్రిషన్ ఫుడ్ ను వారు సంపూర్ణముగా తీసుకొనేలా చూసి రక్తహీనతతో బాధ పడకుండా చూడాలన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాలలోపు రిజిస్టార్ చేసుకొని ఆమెకు అన్నిరకాల వైద్య పరీక్షలు వైద్యసేవలు అందించాలన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీని పరీక్షించాలని, ప్రమాదకర లక్షణాలు వున్న గర్భిణీ స్త్రీల పట్ల జాగ్రతలు తీసుకొంటూ సుఖప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. రక్తహీనత వున్నా, గుండె సంబంధిత సమస్యలు వున్నా, తక్కువ ఎత్తు, తల్లి గర్భంలో ఉమ్మనీరు తక్కవ వున్నా, బిడ్డ పెరుగుదల లేకపోయినా, హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రము డాక్టర్స్ వైద్య సిబ్బందికి, గర్భిణీ స్త్రీలకు, తల్లి మరియు బిడ్డ కు సంబందించిన ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. శిశు మరణాల విషయంలో కూడా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టి కార్పొరేషన్ ద్వారా ఎస్‌టి సుగాలి రైతులకు, భూ పట్టాలు, బోర్లు మంజూరు



**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 12 :** సుగాలి (గిరిజన) రైతులకు భూ పంపిణీ ద్వారా ఆర్ఓఎఫ్ఆర్ భూపట్టాలు, వ్యవసాయ సాగు చేసుకొనుటకు ఉచిత బోర్లు,గిరిజన గురుకుల పాఠశాలలో ఫ్రీ సీటు, ఎస్ సి,ఎస్టీ కేసుల బాద్యుతలకు పరిహారం చెల్లించాలని, పామిడి, వజ్రకరూర్, అనంతపురం, బ్రమ్మ సముద్రం మండలాలకు చెందిన గిరిజనుల సోమవారం ఉదయం అనంతపురం జిల్లా కలెక్టరేట్ లోని రెవిన్యూ భవనం నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిస్కార వేదికలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ కు సమస్యల అర్జీలను అందజేశారు.

**సమస్యల అర్జీల వివరాలు** :1.పామిడి,వజ్రకరూర్ మండలం, కొనేరుపల్లి తాండ,జయరామ పురం గ్రామం లోని సుగాలిలకు ఎస్ టి కార్పొరేషన్ ద్వారా భూ పంపిణీ చేసి ఆర్ ఓ ఎఫ్ ఆర్ ద్వారా డి కెటి భూ పట్టాలు మంజూరు చేసి వ్యవసాయం చేసుకొనుటకు ప్రభుత్వము ఉచిత బోర్లు మంజూరు చేయాలని కోరుతూ తిరుపాల్ నాయక్ అర్జీని ఇంచార్జి జిల్లా కలెక్టర్ కు అందజేశారు.

2.జిల్లాలో ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన వెంటనే వారికి రావలసిన ఎక్స్గ్రేషియా, ఉద్యోగాలు, వ్యవసాయ భూమి మరియు నివాస స్థలాలు మంజూరు చేయాలని వెంటనే నిధులు కేటాయించాలని కోరుతూ జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు సాకే. చిరంజీవి జిల్లా ఇంచార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు అర్జీని అందజేశారు.

3.బ్రమ్మ సముద్రం మండలం,బెరెడ్లుపల్లి గ్రామానికి చెందిన 8 వ తరగతి,6 వ తరగతి చదువుకొనుటకు బుక్కరాయ సముద్రం నందు ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో ఆది 8వ తరగతి,గిరిధర్ 6 వ తరగతిలో చేరి చదువుకొనుటకు సీట్లు ఇప్పించాలని కోరుతూ నాగవేణి అర్జీని ఇంచార్జి జిల్లా కలెక్టర్ కు అర్జీని అందజేశారు. మీరు అందజేసిన సమస్యల అర్జీలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జి జిల్లా కలెక్టర్ అర్జీదారులకు చూచించారు.

## డబ్బు, పేరు, పదవులు ఇవన్నీ అర్థాలు మాత్రమే.....

### - సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి

**కడప పెన్ పవర్ ఆగస్టు 12 :** పరమార్థాన్ని తెలుసుకోవడానికి, జీవన గమ్యంని చేర్చగలిగేవాడు 'గురువు' మాత్రమే అని చెప్పే కథ ఇది. ఓ మహానగరంలో ఓ గురువుగారు తన వద్దకు వచ్చేవారికి ఆధ్మాత్మిక శిక్షణ ఇస్తూ, ధర్మప్రబోధం చేస్తుండేవారు.మహాసంపన్నుడొకడు ఈ గురువుగారి దగ్గరకు వచ్చి. అసలు గురువు అవసరమా?లిగురువు లేకుంటే వచ్చిన నష్టమేమిటి?లిఅని ప్రశ్నించాడు. గురువుగారు నవ్వుకుని, మీరేం చేస్తుంటారని అడిగారు.నాకు అతిపెద్ద సూపర్ బజార్ ఉంది అని సమాధానమిచ్చాడు సంపన్నుడు.అయితే! ఒకసారి మీ సూపర్ బజార్ కు నన్ను తీసుకువెళ్లండని గురువుగారు అడిగారు.ఇద్దరూ కలిసి సూపర్ బజార్ కు వెళ్లారు. ఆ రోజు సెలవు కావడంతో నిర్మానుష్యంగా ఉంది. ఏడంతస్థుల పెద్ద భవంతి. అందులో దొరకనిదంటూ ఉండదు.

దానిని చూసిన గురువుగారు నవ్వుకున్నారు.

అక్కడే ఈ సంపన్నుడు ఆవులను, కుక్కలను పెంచుతున్నాడు. ఆ మందలోంచి ఒక ఆవును సూపర్ బజార్ లోపలికి వదలవలసిందిగా గురువుగారు కోరారు. కోరినట్లుగానే ఆవును లోపలికి ప్రవేశపెట్టారు. అది అన్నీ తిరుగుతూ, తిరుగుతూ చివరకు ఒక మూల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉన్న పండ్ల దుకాణంలోకి వెళ్లింది. కడుపునిండా , తృప్తిగా మేసింది. రెండుగంటల వ్యవధిలో తిరిగి వచ్చేసింది. దుపరి తను పెంచుతున్న కుక్కను లోపలికి వదలమని కోరారు గురువుగారు. దానిని కూడా లోపలికి పంపారు. అది కూడా తిరుగుతూ, తిరుగుతూ వాసన చూస్తూ, మూడవ అంతస్థులో మాంసం అమ్మే దుకాణంలోకి వెళ్లింది. తృప్తిగా తినేసింది. మూడు గంటల వ్యవధిలో అది కూడా తోక ఊపుకుంటూ యజమాని దగ్గరకు వచ్చేసింది. ఈసారి ఒక సామాన్యుడిని పిలిచి, నీకు నచ్చినన దానిని తీసుకో అని చెప్పి పంపారు గురువు. ఉత్సాహంతో లోపలికి ప్రవేశించిన మనిషి అన్నింటినీ చూసి, ఉక్కిరిబిక్కిరైపోయాడు. ఏం తీసుకోవాలో అర్థం కావటం లేదు.రెండు, మూడు, నాలుగు గంటలు గడిచిపోయినా బయటకు రావడం లేదు. అందరూ ఆశ్చర్యపోయారు. గురువుగారు యజమానిని కలిసి అతడున్న చోటకి చేరుకున్నాడు. నెత్తిమీద చేతులు పెట్టుకుని దిక్కులు చూస్తున్న ఆ వ్యక్తికి ఏం కావాలో అర్థం కావడం లేదు. ఈ వస్తులన్నింటినీ చూస్తుంటే పిచ్చెత్తిపోతోంది అన్నాడు ఆ వ్యక్తి. దీనిని విన్న సంపన్నుడు అవాక్కయ్యాడు.

ఆవుకీ, కుక్కకీ పిచ్చెక్కలేదు. వాటికి ఏం కావాలో వెతుక్కుని తృప్తిగా ఆరగించి వచ్చాయి. మనిషి మాత్రం ఏం కావాలో తనకే తెలియదు. తనకే అన్ని తెలుసనుకుంటాడు. పాపం! అందుకే వీడికి గురువు కావాలి. ఎలా జీవించాలో జీవిత ఔన్నత్యాన్ని ఎలా పొందాలో తెలుసుకోవాలి. అందుకే వాటిని తెలియజెప్పే గురువు అత్యంత అవసరమని గురువుగారు చెప్పడంతో యజమానికి ధనగర్వం తొలగింది. గురువుతోనే గమ్యం సాధ్యమని తెలుసుకున్నాడు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**ధర్మవరం, ఆగస్టు 12 :** మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా కొనసాగుతోంది. ఆ పిలుపు నేపథ్యంలో, రాష్ట్ర వైద్య, విద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు సత్య కుమార్ యాదవ్ ఆదేశాల ప్రకారం, మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు ఆధ్వర్యంలో, రూరల్ మండల అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, పోతుకుంట గ్రామ సర్పంచ్ అంగజల నాగవేణి అధ్యక్షతన, అంగజల రాజశేఖర్ సహకారంతో, మంగళవారం పోతుకుంట గ్రామంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించబడింది. గ్రామ వీధులలో పిల్లలు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొని, చేతుల్లో జాతీయ పతాకాన్ని ఊపుతూ దేశభక్తి గీతాలను ఆలపించారు. పిల్లలు నేటి బాలలే రేపటి పౌరులు అన్న భావనతో, తమ చదువులో రాణించి దేశం కోసం పని చేయాలనే స్ఫూర్తితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ ౦ ప్రతి భారతీయుడి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరవేయడం ద్వారా దేశభక్తిని, జాతీయ ఐక్యతను ప్రతిబింబిద్దాం. జెండా కేవలం ఓ వస్తువు కాదు, అది మన స్వాతంత్ర్యం, త్యాగం, గౌరవానికి ప్రతీక.





ప్రతి పౌరుడు తన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి, స్వాతంత్ర్య వేడుకలలో భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకునే ఈ సందర్భం, భవిష్యత్ తరాలకు దేశభక్తి పాఠం నేర్పే ఒక గొప్ప వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ యంపీడీవో వెంకటేష్, పోతుకుంట సర్పంచ్ అంగజాల నాగవేణి, రూరల్ మండల అధ్యక్షులు చంద్ర, పోతుకుంట రాజు, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమహేష్, శ్యామరావు భక్తవస్థలం, నారప్ప, రవి, వరలక్ష్మి, జగ్గా నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పి4 పాలసీ కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న

# నీడ్ అసెస్మెంట్ సర్వే రేపటి లోపు పూర్తి చేయండి

### ఈపీటీఎస్ ఆన్లైన్ పోర్టల్‌లో డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ పూర్తి కావాలి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 12 :** పి4 పాలసీ కి సంబంధించి పెండింగ్ లో ఉన్న నీడ్ అసెస్మెంట్ సర్వే రేపటి లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మున్సిపల్ కమిషనర్ లను, ఎంపిడిఓ లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం పి4 పాలసీ, ఈపీటీఎస్ డాక్యుమెంట్స్ అప్లోడ్ అంశాల పై జిల్లా కలెక్టర్ ఆర్డీఓ లతో, మున్సిపల్ కమిషనర్ లతో, ఎంపిడిఓ లతో, టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి 4 పాలసీ కింద జిల్లాలో ఇప్పటివరకు 50 వేల 904 బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకున్నారన్నారు... ఇందు కోస. కృషి చేసిన ఆర్డీఓ లు, మున్సిపల్ కమిషనర్ లు, ఎంపిడిఓ లను కలెక్టర్ అభినందించారు.. ఇంకా 9 వేల బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పెండింగ్ లో ఉందన్నారు.. ఇందులో 2 వేల 600 ఆదోని నియోజకవర్గంలోనే చాలా వరకు పెండింగ్ లో ఉందన్నారు.. ఆదోని అర్బన్ లో 1483, ఆదోని రూరల్ లో 1131 పెండింగ్ లో ఉన్నాయన్నారు.. ఈ అంశంపై పర్యవేక్షించి పెండింగ్ లో ఉన్న దత్తత ప్రక్రియను పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్ ను ఆదేశించారు. బంగారు కుటుంబాలకు ఏమేమి అవసరాలు ఉన్నాయి అని చేసే నీడ్ అసెస్మెంట్ సర్వే అంశం పై మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు... నీడ్ అసెస్మెంట్ సర్వే లో 7 వేలు 600 పెండింగ్ లో ఉంటే, కర్నూలు, ఆదోని మున్సిపల్ కమిషనర్ ల వద్దనే 6 వేలు పెండింగ్ లో ఉన్నాయన్నారు.. ఈ అంశం పై రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు, చీఫ్ సెక్రటరీ గారు సమీక్షలు నిర్వహిస్తున్నారన్నారు... ఈ అంశం పై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు.. అదే విధంగా ఆదోని రూరల్, కల్లూరు, వెల్దుర్తి, కోడుమూరు, కౌతాళం, దేవనకొండ,హొళగుంద మండలాల్లో కూడా కొన్ని పెండింగ్ లో ఉన్నాయని, రేపు సాయంత్రం లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు.. హొళగుంద మండలం కేవలం 60 శాతం మాత్రమే నీడ్ అసెస్మెంట్ సర్వే చేయడం ఏంటని కలెక్టర్ ఎంపిడిఓ ను కలెక్టర్ ప్రశ్నించారు.. త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ ను ఆదేశించారు. ఈపీటీఎస్ ఆన్లైన్ పోర్టల్ లో డాక్యుమెంట్స్ అప్లోడ్ కు సంబంధించి అన్ని శాఖల అధికారులు మెమో లు, జీఓ లు, సర్క్యులర్ లు, ప్రొసీడింగ్ లు, కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు లాంటివి అని కూడా స్కానింగ్ చేసి అప్లోడ్ చేయాలన్నారు.. దాదాపు 80 వేల వరకు అప్లోడ్ చేశారని, హొళగుంద, కొసిగి, కృష్ణగిరి, మంత్రాలయం, మద్దికెర, కౌతాళం మండలాల ఎంపిడిఓ లు అప్లోడ్ చేయడంలో వెనుకబడి ఉన్నారని, కౌతాళం, ఆదోని, సి.బెలగల్, కోసిగి, ఆలూరు మండలాల తహసిల్దార్ లు కూడా చాలా వెనుకబడి ఉన్నారని, త్వరితగతిన అప్లోడ్ చేయాలని కలెక్టర్ సంబంధిత మండలాల ఎంపిడిఓ లు, తహసిల్దార్ లను ఆదేశించారు..కర్నూలు, హాలహర్వి మండలాల ఎంపిడిఓ లు, నందవరం, పత్తికొండ, వెల్దుర్తి మండలాల తహసిల్దార్ లు బాగా చేశారన్నారు.. స్టేట్ ఆడిట్, ఎన్టీఆర్ వైద్య సేవ, ఆర్ఐవో, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, డిటిసి, సివిల్ సప్లైస్ లాంటి శాఖలు కూడా చాలా నిదానంగా అప్లోడ్ చేస్తున్నారని ఏడి సర్వే సర్వ శిక్ష అభియాన్ శాఖలు ఆన్లైన్ అప్లోడ్ చేసే ప్రక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు.. ఈపీటీఎస్ ఆన్లైన్ పోర్టల్ లో డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయడంలో వెనుకబడిన జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ డిఆర్ఓ ను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, కర్నూల్ ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్ డి ఓ భరత్ నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా అధికారులు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జలాలను పెంచే విధానం

# వర్షపు నీటిని ఎక్కడికి అక్కడే భూగర్భంలోకి : డాక్టర్ సురేష్ బాబు

### – ఫోర్ వాటర్ ద్వారా నీటిని ఒడిసి పట్టాలి – డా. యం.సురేష్ బాబు, అధ్యక్షుడు, ప్రజాసైన్స్ వేదిక







**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 12 :** సుప్రసిద్ధ భారతీయ పర్యావరణవేత్త నీటి సంరక్షణావేత్త అనుపమ్ మిశ్రా అభివృద్ధి చేసిన వినూత్న నీటి నిర్వహణ వ్యూహం "ఫోర్ వాటర్స్" . ఈ భావన నాలుగు రకాల నీటి వనరుల స్థిరమైన నిర్వహణను నొక్కి చెబుతుంది, ఈ వ్యూహాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చెందిన నీటి పారుదల ఇంజినీర్ శ్రీ హనుమంతరావు విస్తృత ప్రచారం చేశారు. ముఖ్యంగా కాలానుగుణ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో భవిష్యత్తులో ఉపయోగం కోసం వర్షపు నీటిని సంగ్రహించడం మరియు నిల్వ చేయడం. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్, ట్యాంకులు కుంటలు తలపిరి చెరువులు వంటి వివిధ పద్ధతుల ద్వారా దీనిని సాధించవచ్చు. వర్షపు నీటిని మట్టిలో చొచ్చుకుపోయేలా చేయడం, జలాశయాలను తిరిగి నింపడం ద్వారా భూగర్భజల వనరులను రీఛార్జ్ చేయడం నిర్వహించడం. చెక్ డ్యామ్‌లు, రీఛార్జ్ వెల్స్ కాంటూర్ ట్రెంచ్‌లను నిర్మించడం వంటి సాంకేతికతలు భూగర్భ జలాల రీఛార్జ్‌ను పెంచడానికి ఉపయోగించబడతాయి. నదులు, సరస్సులు రిజర్వాయర్‌ల వంటి ఉపరితల నీటి వనరులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా వ్యవసాయ, గృహ మరియు పారిశ్రామిక అవసరాలకు స్థిరమైన నీటి సరఫరాను నిర్ధారించడం. ఇందులో నీటి వనరులు కాలుష్యం నుండి రక్షించడం, నీటి ప్రవాహాన్ని నిర్వహించడం ఆనకట్టలు, ట్యాంకుల వంటి నిల్వ నిర్మాణాలు నిర్మించడం వంటివి ఉంటాయి. మల్చింగ్, కాంటూర్ దున్నడం అడవుల పెంపకం వంటి తగిన భూ నిర్వహణ పద్ధతుల ద్వారా నేల తేమను సంరక్షించడం. ఈ పద్ధతులు నేలలో నీటిని నిలుపు కోవడానికి, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడానికి, నేల కోతను తగ్గించడానికి సహాయపడతాయి. "ఫోర్ వాటర్స్" భావన నీటి నిర్వహణకు సమగ్ర విధానాన్ని ప్రోత్సహిస్తుంది, ముఖ్యంగా శుష్క మరియు పాక్షిక-శుష్క ప్రాంతాల్లో కమ్యూనిటీలు, వ్యవసాయం పర్యావరణ వ్యవస్థలలో మద్దతునిచ్చే స్థిరమైన స్థితిస్థాపక నీటి సరఫరా వ్యవస్థను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది నీటి కొరతను పరిష్కరించడానికి నీటి సంరక్షణను ప్రోత్సహించడానికి సమాజ ప్రమేయం, సాంప్రదాయ జ్ఞానం స్థానిక పరిష్కారాలను నొక్కి చెబుతుంది. దేశంలో వెనుకబడిన ప్రాంతాల్లో కరువు పీడిత ప్రాంతం అయిన రాయలసీమ, ఉత్తర తెలంగాణ అభివృద్ధిలో "ఫోర్ వాటర్" భావన కీలక పాత్ర పోషిస్తుంది. ఈ భావనను అమలు చేయడంలో వర్షపు నీరు, భూగర్భ జలాలు, ఉపరితల జలాలు మరియు నేల తేమను నిర్వహించడానికి సమగ్ర వ్యూహం ఉంటుంది, తద్వారా నీటి లభ్యతను మెరుగుపరచడం, స్థిరమైన అభివృద్ధి ప్రోత్సహించడం. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ద్వారా భవిష్యత్తు ఉపయోగం కోసం వర్షపు నీటిని సంగ్రహించడం మరియు నిల్వ చేయడం. పైకప్పుపై వర్షపు నీటి నిల్వ వ్యవస్థల నిర్మాణాన్ని ప్రోత్సహించాలి. పైకప్పుల నుండి సేకరించిన వర్షపు నీటిని ట్యాంకులలో నిల్వ చేయవచ్చు లేదా భూగర్భ జలాలు రీఛార్జ్ చేయడానికి మళ్లించవచ్చు. కమ్యూనిటీ-లెవల్ హార్వెస్టింగ్ ద్వారా వర్షపు నీటి ప్రవాహాన్ని సంగ్రహించడానికి పెద్ద కమ్యూనిటీ ట్యాంకులు లేదా చెరువులు నిర్మించాలి. పొడి కాలంలో ఈ నిర్మాణాలు కీలకమైన నీటి వనరుగా ఉపయోగపడతాయి. కాలానుగుణ ప్రవాహాలు నదులపై చెక్ డ్యామ్‌లను నిర్మిస్తే తరచుగా మట్టి లేదా కాంక్రీట్ అడ్డంకులు నీటి ప్రవాహాన్ని నెమ్మదిస్తాయి, ఇది భూమిలోకి చొచ్చుకుపోయేలా చేస్తుంది. పెర్కొలేషన్ పిట్స్, రీఛార్జ్ వెల్స్ వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చేయడానికి జలా శయాలను తిరిగి నింపడానికి వ్యూహాత్మక ప్రదేశాలలో పెర్కొలేషన్ పిట్స్ రీఛార్జ్ బావులను తవ్వించాలి. కాంటౌర్ ట్రెంచ్‌లు మరియు బండ్‌లు ద్వారా ప్రవాహాన్ని తగ్గించడానికి మరియు భూగర్భ జలాల రీఛార్జ్‌ను పెంచడానికి వ్యవసాయ భూమిపై కాంటౌర్ ట్రెంచ్‌లు మరియు బండ్‌లను నిర్మించాలి. సాంప్రదాయ ట్యాంకులు చెరువులు పునరుద్ధరించడం ద్వారా వాటి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం బాష్పీభవన నష్టాలను తగ్గించవచ్చు. ఇంటర్‌లింకింగ్ వాటర్ బాడీస్ ద్వారా ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన ట్యాంకులు, చెరువుల నెట్‌వర్క్‌ను రూపొందిస్తే, ఒక ప్రాంతం నుండి మిగులు నీటిని మరొక ప్రాంతానికి మళ్లించడం ద్వారా నీటి కొరత తగ్గుతుంది. వాటర్‌షెడ్ అభివృద్ధి ద్వారా ఉపరితల నీటి లభ్యత నేల సంరక్షణను మెరుగుపరచడానికి వాటర్‌షెడ్‌లను అభివృద్ధి చేయలి. ప్రవాహాలు, కోతను తగ్గించడానికి అటవీ పెంపకం, నేల సంరక్షణ చర్యలు ఇందులో ఉన్నాయి. వ్యవసాయానికి మద్దతుగా, నేల కోతను తగ్గించడానికి నేల తేమను నిలుపుకోవాలి. నేల ఉపరితలాన్ని కవర్ చేయడానికి సేంద్రీయ మల్చ్‌లను ఉపయోగిస్తే, తేమను నిలుపుకోవడంలో సహాయపడుతుంది, బాష్పీభవనాన్ని తగ్గిస్తుంది అలాగే నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేల భంగం తగ్గించి నేల తేమను నిలుపుకోవడంలో సహాయపడే పరిరక్షణ సాగు పద్ధతులను రైతులు అనుసరించాలి. అగ్రో ఫారెస్ట్రీ మెరుగుపరుచుకోవాలి, కమ్యూనిటీ ఇన్వాల్వ్మెంట్, కెపాసిటీ బిల్డింగ్, రైతులు, స్థానిక నివాసితులకు వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్ మరియు నేల తేమ సంరక్షణ పద్ధతులపై శిక్షణా కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించినప్పుడే వ్యవసాయం మనుగడ అలాగే సాగునీరు తాగునీరు ఎద్దడిని నిర్మూలించవచ్చు.








## నులిపురుగుల్ని నులిమేద్దాం... ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



**పెళ్లకూరు, పెన్ పవర్, ఆగస్టు 12 :** పెళ్లకూరు మండల వ్యాప్తంగా మంగళవారం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ జితేంద్ర తెలిపారు. అందులో భాగంగా పెళ్లకూరు హైస్కూల్లో ఉన్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ నులుపురుగుల (ఆల్బెండజోల్ మాత్రలు) పిల్లలందరికీ మింగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీల రాణి మాట్లాడుతూ... నులిపురుగులు పిల్లల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. పిల్లల్లో నులిపురుగులు నిర్మూలించి రక్తహీనత నివారణ, శారీరక మానసిక ఎదుగుదలకు, పోషకాహార లోపం, పిల్లల్లో అలసట, బలహీనత వంటి సమస్యలను నిర్మూలించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఎంపీడీవో ప్రమీల రాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర , పీహెచ్ఓ శివ రెడ్డి, హెచ్ వి రాజ్ కుమారి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఇంచార్జ్ స్వర్ణలత, సెక్రెటరీ రామ ప్రభ, ఏఎన్ఎం నాగూరమ్మ, ఆశా లక్ష్మి, స్కూల్ టీచర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తాళ్లపాక శ్రీ సిద్ధేశ్వరస్వామివారి ఆలయ పవిత్రోత్సవాలు



**అన్నమయ్య పెన్ పవర్ ఆగస్టు 12 :** అన్నమయ్య జిల్లా తాళ్లపాకలోని శ్రీ సిద్ధేశ్వరస్వామివారి ఆలయంలో ఆగష్టు 14 – 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక జరిగే దోషాల వల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పవిత్రోత్సవాలలో ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆగష్టు 14న పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, గ్రంధి పవిత్ర పూజ నిర్వహిస్తారు. ఆగష్టు 15న విష్వక్సేనపూజ, యాగశాల పూజ, వేదికార్చన, పరివార దేవతలకు గ్రంధి పవిత్ర సమర్పణ, నివేదన, హారతి, లఘు పూర్ణాహుతి చేపడతారు. ఆగష్టు 16న పవిత్ర సమర్పణ, నిత్య పూజ, వేదికార్చన, నిత్య హోమం, పట్టు పవిత్ర పూజ, మహా పూర్ణాహుతి, పవిత్రవితరణ, స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు జరుగనున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో హరికథలు, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ : ఆచార్య జి.పార్వతి



**కడప పెన్ పవర్ ఆగస్టు 12 :** గ్రంథాలయంలో పుస్తకాల వర్గీకరణకు సి.సి.(కోలోన్ క్లాసిఫికేషన్) ప్రక్రియను తీసుకొచ్చిన గ్రంథాలయ పితామహుడు డా.ఎస్.ఆర్.రంగనాథన్ అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం మంగళవారం ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి సందర్భంగా 'గ్రంథపాలకుల దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముందుగా సంచాలకులు, సిబ్బంది కలసి ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఆ తర్వాత ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ డా.ఎస్.ఆర్.రంగనాథన్ మద్రాసులో 1927వ సంవత్సరంలో జరిగిన 4వ అఖిల భారత పౌర గ్రంథాలయ మహాసభ పూర్తయ్యాక మద్రాసు గ్రంథాలయ సంఘాన్ని స్థాపించేందుకు సహకరించారన్నారు. సంఘ కార్యదర్శిగా ఎన్నికై అనితర సామాన్యమైన కృషి చేశారన్నారు. సహాయ పరిశోధకులు డా? చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయాలు క్రియాశీలక పాత్ర పోషించాయన్నారు. ఉద్యమానికి అయ్యంకి వెంకటరమణయ్య, రంగనాథన్ తదితరులు సమిధలుగా మారారన్నారు. గ్రంథాలయంలో పుస్తకాలను పాఠకులకు సులభంగా అందించేలా నూతన ఒరవడిని తీసుకొచ్చిన ఘనత రంగనాథన్‌దేనన్నారు. గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేష్ రావు మాట్లాడుతూ బెనారస్ విశ్వవిద్యాలయంలోని లక్ష పుస్తకాలను రంగనాథన్ వర్గీకరించడం విశేషమన్నారు. 'గ్రంథాలయ పంచశీల సూత్రాలకు' ఆద్యుడు రంగనాథన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

### – జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 12 :** గోకులం షెడ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ డ్వామా పిడిని, సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరం నందు గోకులం షెడ్ల నిర్మాణం పై డ్వామా పిడి, ఏపీవో, ఏపీడీలు, ఫీల్డ్ అసిస్టెంట్ లతో క్షేత్ర సాయి సిబ్బంది పనితీరు పై వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారాసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారం వారం గోకులం షెడ్ల నిర్మాణ ప్రగతి పై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండలాలలో ఎన్ని అభివృద్ధి పనులు పనులు ఆమోదించడం జరిగింది, ఎన్ని పనులు పూర్తి చేసాము, బిల్లులు జనరేటర్ అయిందా లేదా, పశువుల షెడ్ల గోడల నిర్మాణం ఎంతవరకు వచ్చాయో తెలియజేయాలని డ్వామా పిడిని ఆదేశించారు. మార్కింగ్ చేసిన చోటపనులను వెంటనేప్రారంభించాలనినాలుగు స్టేజీల్లోబిల్లులనుఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలనిఆదేశించారు. నిర్మాణాలు త్వరితగతినపూర్తయ్యేలా పని చేయాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణంలో ఏపీడీలు, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు మార్కింగ్ చేసిన వెంటనే పనులు ప్రారంభించేలా పూర్తి చేసిన వెంటనే బిల్లులు అప్లోడ్ చేసే విషయంలో కృషి చేయాలనిఆదేశించారు.2025–26 ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఎన్ని గోకులం షెడ్లు మంజూరయినవని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పనుల్లో పురోగతి చూపేలా షెడ్ల పనులు పూర్తిగా గాని 10 రోజులలో బిల్లు అప్లోడ్ చేయాలన్నారు. కాంట్రాక్టర్లు ఏమైనాసమస్యలుఉంటేపరిష్కరించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏ పనులు అయితే జరిగాయి ఆ పనులు మాత్రమే ఆన్ లైన్ నందు అప్లోడ్ చేయాలన్నారు. తప్పుడు ఎంట్రీలను నమోదు చేయకుండా ఏవైతే జరిగాయో వాటిని ఆన్లైన్ నందు అప్లోడ్ చేయాలని ఏపీవో లు, ఏపీడివోలు, ఫీల్డ్ అసిస్టెంట్ లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి రవికుమార్, ఏపీవోలు, ఏపీడివోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



హెచ్ఐవి పట్ల అవగాహన కల్పిస్తూ తయారుచేసి పోస్టర్లను విడుదల చేసిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మరియు జేసి శుభం బన్సల్ తదితరులు.



కడప నగరంలోని సాయి శ్రీనివాస గార్డెన్స్ నందు రాధా ఆటోమొబైల్స్ పట్టాభి రెడ్డి గారి కుమారుని వివాహానికి ముఖ్య అతిథులుగా హాజరై వధూవరులను ఆశీర్వదించిన కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి హ్యూమన్ రైట్స్, సివి భాస్కర్ రెడ్డి, వీరితోపాటు నాయకులు ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

## శెట్టిపల్లి భూముల సమస్యకు త్వరలో పరిష్కారం

### జిల్లా కలెక్టర్ వెంటేశ్వర్ హామీ.. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 12 :** శెట్టిపల్లి భూముల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ వెంకటేస్వర్ వెల్లడించారు. మంగళవారం తిరుపతి తుడా కార్యాలయంలో శెట్టిపల్లి భూముల సమస్యలపై తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఇతర అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా శెట్టిపల్లి భూముల రైతులు, ఫ్లాట్స్ కొనుగోలుదారులు జిల్లా కలెక్టర్ ను, తుడా చైర్మన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. శెట్టిపల్లి భూముల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఆదేశించారని కలెక్టర్ తెలియజేశారు. శెట్టిపల్లి భూములపై ఇప్పటివరకు 60కి పైగా కేసులు నమోదయున్నాయని అయినా కూడా ప్రజల ప్రయోజనం దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళుతున్నామని వివరించారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి కూడా శెట్టిపల్లి భూముల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని గుర్తు చేశారు. వీలైనంత త్వరగా రైతులకు, ప్లాట్ కొనుగోలుదారులకు భూములను అప్పగించడం జరుగుతుందన్నారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారం కానీ శెట్టిపల్లి భూముల సమస్య తన మొదటి అజండగా తీసుకొని తాను తుడా ఛైర్మెన్ గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి గారితోను, జిల్లా ఇన్చార్జి మంత్రి గారి తో చర్చించి ఒక కొలిక్కి తీసుకువచ్చామని తెలియజేశారు. ఇప్పటికే భూములు మ్యాపింగ్, డిజైనింగ్ పూర్తి చేసామని కార్పొరేషన్ నుంచి తుడా కు ఈ శెట్టిపల్లి భూముల ఫైల్ బదిలీ అయిన వెంటనే ప్రభుత్వ అనుమతితో భూములను లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

## డెత్ క్లైమ్‌లను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు

### రీజినల్ పిఎఫ్ కమిషనర్

**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు,12 :** డెత్ క్లైమ్ లను వేగంగాపరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కడప రీజినల్ పిఎఫ్ కమిషనర్ రవితేజ కుమార్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు కడప ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయం పరిధిలో ఈపీఎఫ్వోసభ్యులు,యాజమాన్యాలు, పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జులై నుంచి సెప్టెంబరు వరకు ప్రత్యేక కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈపీఎఫ్ సభ్యుడు చనిపోయి నెలలు, ఏళ్లు గడు స్తున్నా డైత్ క్లైమ్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి కుటుంబ సభ్యులు యాజమాన్యాల ద్వారా కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు జిల్లా కార్యాలయాల్లో సంబంధిత ధ్రువ పత్రాలను అందజేయాలని సూచించారు. ఈపీఎఫ్ సభ్యుడు తన జీవిత కాలంలో యూనివర్సల్ అకౌంట్ నంబరు (యూఏఎన్)కు ఇ-నామినేషన్ జతచేసి ఉన్నట్లయితే.. అతని మరణాంతరం. అతడి కుటుంబ సభ్యులు ఆన్లైన్లోనే డెత్ క్లైమ్లు సమర్పించవచ్చన్నారు. కడప ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని కడప,అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని యాజమాన్యాలు, ఈపీఎఫ్ సభ్యులు, నామినీలు డెత్ క్లైమ్లకు సంబంధించిన వివరాలను లేదా ఫిర్యాదులను 9491138280 చరవాణి నంబరుకు ఫోన్ చేసిగాని వాట్సప్ ద్వారా గాని పంపవచ్చని వివరించారు.

## జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం ఘనంగా ప్రారంభం



**అనంతపురం పెన్ పవర్ ఆగస్టు 12 :** జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈరోజు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహెూర్ గారు సెయింట్ అగస్టీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, రెవెన్యూ కాలనీ, అనంతపురం నందు లాంఛనంగా ప్రారంభించడమైనది. ఈ సందర్భంగా 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచితంగా ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలు పంపిణీ చేయడం జరిగింది. జిల్లాలో మొత్తం 5,99,852 మంది పిల్లలను ఈ కార్యక్రమం ద్వారా లక్ష్యంగా పెట్టుకొని 585364( 97.58%)మంది పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్ అందించడమైనది. అసిస్టెంట్ కలెక్టర్ ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ ఈ టాబ్లెట్ నోటి ద్వారా నమిలి చప్పరించి తీసుకోవడం ద్వారా పిల్లలలో కడుపులో ఉండే నులి పురుగులను నిర్మూలించడం, రక్తహీనత, బలహీనత, ఎదుగుదల లోపాలను నివారించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడి కేంద్రాలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు వంటి 4,750కి పైగా కేంద్రాలలో ఈరోజు మాత్రలు పంపిణీ చేస్తున్నారన్నారు. మాత్ర తీసుకోని పిల్లలకు మాప్-అప్ రౌండ్ ద్వారా తిరిగి ఈనెల 20వ తారీకు నాడు పంపిణీ చేయడం జరుగుతుంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా ఈ బి దేవి మాట్లాడుతూ జిల్లా లోని 1 సంవత్సరము వయసు ఉన్న పిల్లలు నుండి 19 సంవత్సరాల వయసు పిల్లలు అందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరుగుతుందని ,ఆరోగ్యశాఖ సిబ్బంది మాత్ర వేసుకున్న తర్వాత ఏదైనా దుష్ప్రభావం కలిగితే సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమం అనంతరం వైద్యాధికారి గణాంకాలను ఈ రోజు కార్యక్రమం అనంతరం అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డా. జి.నారాయణస్వామి, మాట్లాడుతూ పిల్లలందరూ ప్రతి రోజు శారీరక వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ మంచి ఆహారపు అలవాట్లను,వ్యాయామాలను అలవర్చుకోవాలన్నారు. అలాగే విద్యార్థుల చేత చేతుల పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎన్ డి డి నోడల్ అధికారులు డా. నరేష్ , డా. నాగేంద్ర మాట్లాడుతూ పిల్లలందరూ ఆరు నెలలకు ఒకసారి ఈ ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవడం ద్వారా నులిపురుగుల నిర్మూలనతో పాటు మంచి ఆరోగ్యం, చదువు పట్ల శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ & సుజాత, కరస్పాండెంట్ సిస్టర్ మేరీ, వెంకటస్వామి, రోహిత్ నాయుడు మరియు డెమో త్యాగరాజు , ఆరోగ్య విద్యా అధికారి గంగాధర్,సిబ్బంది ఇన్‌చార్జి రంగస్వామి, జగదీష్, మేనేజర్ డి.రజిత , సైకాలజిస్ట్ సుందర్ రావు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మన బంధు ఫౌండేషన్‌తో...

## మానసిక ఆరోగ్య వ్యక్తులను వాసవి శరణాలయం...

### కన్వీనర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి.. బాల సురేష్










**కడప పెన్ పవర్ ఆగస్టు 12 :** రాయలసీమలో వివిధ జిల్లాలలో నగర వీధులలో, రోడ్ల వెంబడి, తిరిగే మానసిక అనారోగ్య వ్యక్తులను గుర్తించిన మనోబంధు ఫౌండేషన్ ఫిబ్రవరి నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన అందులో భాగంగా వారికి ప్రత్యేక వైద్యము కడపలో మానసిక వైద్య కళాశాల లో మంచి వైద్యముతో పాటు సాత్విక ఆహారము, నిరంతర పర్యవేక్షణ మొదలైన కార్యకలాపాల ద్వారా వారిని ఆరోగ్యం వంతులను చేసి తిరిగి మనోబంధు ఫౌండేషన్ సహాయంతో వారిని నిరాదరణకు గురి అయిన వారిని వాసవి ఫౌండేషన్ పులివెందుల అర్బన్ డెవలప్మెంట్ సొసైటీ కి సూపర్వైజర్ బాల సురేష్, నిర్మలారెడ్డి, కన్వీనర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి , పులివెందుల కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆరు మందిని అక్కడ చేర్పించడం జరిగినది. వాసవి శరణాలయం వారు, మనోబంధు సేవా ఫౌండేషన్ వారి పూర్తి సహకారము అందించగలరని కోరారు. దానికి అనుకూలంగా పులివెందుల కొండారెడ్డి బాల సురేష్, నిర్మలారెడ్డి, కన్వీనర్ కృష్ణారెడ్డి సమ్మిరెడ్డి పూర్తి సహకారం అందిస్తామని తెలియజేశారు.





# మన ఆనందానికి రహస్యం ఏమిటో మనకు తెలుసా?




### డాక్టర్ సునీత... అప్పల రెడ్డి సింధు





**కన్వ పెన్ పవర్ ఆగస్టు 12 :** మనస్సు ఆడే ఆట ...

అది వేసవి కాలం, నేను ఏదో పని మీద ఇంటి నుండి బయటకు వచ్చాను. పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా వేడి విపరీతంగా పెరిగింది. ఒక రోజ్ వుడ్ చెట్టును చూసి, చెమట ఆరేదాకా దాని నీడలో కాసేపు కూర్చోవాలని అనుకున్నాను. నేను వెళ్లి చెట్టుకింద నిలబడ్డాను. కొద్దిసేపటికి, ఎదురుగా ఉన్న ఇంటి కిటికీ తెరుచుకుంది, ఒక వ్యక్తి బయటకు చూస్తూ, త్రాగడానికి నీరు కావాలా అని అడిగాడు. నాకు చాలా దాహంగా ఉండడంతో సరే అన్నాను. మేమిద్దరం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. సైగలలో మాత్రమే మాట్లాడుకున్నాం. అతను ఎంత మంచి వ్యక్తి! అని నేను అనుకున్నాను. నేను ఎవరో అతనికి తెలియదు, అయినప్పటికీ నాకు దాహం వేస్తోందని అతను గ్రహించగలిగాడు! ఎంత దయగల మనిషి! నేను అక్కడ ఎదురుచూస్తూ నిలబడ్డాను. 5 నిమిషాలు గడిచాయి, ఆపై 7%ॉ% 10 నిమిషాలు, కానీ అతను రాలేదు, దీని అర్థం ఏమిటని నాలో నేను అనుకున్నాను. నాకు నీళ్ళు తీసుకురావడానికి ఇష్టం లేకపోతే, అతను నన్ను ఇక్కడ వేచి ఉండమని ఎందుకు అన్నాడు? నేను ఇంత సేపు ఇక్కడ నిలబడ్డాను, ఈపాటికి ఇంటికి వెళ్లిపోయి ఉండేవాడిని. ఎంత రాతి హృదయం గల వ్యక్తి!! ... ఇలా అతనిపై రకరకాల ప్రతికూల ఆలోచనలు రావడం మొదలుపెట్టాయి. అంతలోనే ముందు గేటు తెరుచుకుంది. ఆ వ్యక్తి చేతిలో జగ్గుతో వస్తున్నాడు. “సారీ బ్రదర్, మామూలు నీళ్ళు ఎందుకు తీసుకురావడం అనుకుని, వేడి ఎక్కువగా ఉంది కాబట్టి నిమ్మరసం తయారు చేద్దాం అనుకున్నాను. నీకోసం నిమ్మరసం తెచ్చాను” అన్నాడు. నా ఆలోచనల ప్రవాహ దిశ మళ్లీ మారిపోయింది. నేను ఆలోచించడం మొదలుపెట్టాను, అతనిది ఎంత విశాల హృదయం! నేను తప్పుగా ఆలోచించాను. గ్లాసులో నిమ్మరసం పోశాడు. నేను కొద్దిగా తీసుకున్న వెంటనే, అందులో చక్కెర లేదని గ్రహించాను. అతను నన్ను మూరు?డిని చేసాడనుకున్నాను. అతను చక్కెర కలపకుండా నిమ్మరసం చేసాడు! అలాంటి రుచిలేని నిమ్మరసం వల్ల ఉపయోగం ఏమిటి? దానికన్నా సాదా నీరు తీసుకువస్తే బాగుండేది!! ఒక్క క్షణంలో, ఆలోచనల దిశ మళ్లీ మారింది. కానీ అతను వెంటనే జేబులోంచి పొట్లం తీసి, “బ్రదర్, మీకు పంచదార ఎంత ఇష్టమో, అసలు పంచదార తీసుకుంటారో లేదో నాకు తెలియదు! అందుకే విడిగా పంచదార తెచ్చాను.” అతను నిజంగా మంచి మనిషి అని నేను మళ్ళీ అనుకున్నాను. ఇది, మనస్సు ప్రతి క్షణం మనతో ఆడే మనస్సు యొక్క ఆట ! పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకోకుండా స్వంతగా ఊహించుకోవడం వలన మన అభిప్రాయాలు చాలా త్వరగా మారుతాయి. వాస్తవానికి, మన మనస్సులో తలెత్తే ఆలోచనల ప్రవాహం, బాహ్య పరిస్థితుల కంటే అంతర్గత స్థితి వల్ల ఎక్కువగా ప్రభావితమవుతుంది, ఆపై దాని చుట్టూ మంచి - చెడుల వలను సృష్టిస్తుంది. దానికి స్పందించడం వల్ల ప్రతి క్షణం ఈ వలలో మనం చిక్కుకుపోతూ ఉంటాం ... అలా మనసు ఆడే ఆటలకి బలైపోతాం... మనసుకి బానిసలవుతాం!! మనసును ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంచుకోవడంలోనే ఆనందపు రహస్యం దాగి ఉంది. నిజమైన ఆధ్యాత్మిక శిక్షణ మన మనస్సును క్రమశిక్షణతో, క్రమబద్ధంగా చేస్తుంది. మన విధిని సృష్టించుకోవాలంటే మన మనసు యొక్క సూక్ష్మ శరీరాన్ని మెరుగుపరచుకోవాలి.



దాజీజి
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం
అనువాదబృందం ఆంధ్రప్రదేశ్

## తల్లికి వందనం పడని వారికి ఈకెవైసి చేయించాలి

### ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ




**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 12 :** బంగారు కుటుంబాలు దత్తకు సంబంధించి ఎవరిని బలవంతం చేయవద్దని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ క్యాంపు ఆఫీసు నుండి ఉపాధి హామీ పథకం, పి4 సర్వే,పంచాయతీ, మున్సిపల్ సెక్టార్, గ్రామ / వార్డు సచివాలయ ద్వారా చెప్పటుతున్న వివిధ అంశాలపై ,డ్వామా పి డి, డిపిఓ,నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, యం పి డి ఓ లు,ఏ పిడి లు,ఏ పి యం లు తో ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈసందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాలు దత్తకు సంబంధించి ఎవరిని బలవంతం చేయవద్దని, స్వచ్ఛందంగా వచ్చిచే వాళ్లే మార్గదర్శులు వచ్చే వారిని సంప్రదించాలన్నారు. బంగారు కుటుంబాలకు సంబంధించి సర్వే పూర్తి చేయాలని, సర్వే పూర్తి అయిన గ్రామాలలో బంగారు కుటుంబాలు మార్గదర్శులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని, బంగారు కుటుంబాలు పెంచడానికి నియోజకవర్గాల కేంద్రాలలో ఉన్న యం పి డి ఓ లు,స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పి ఆర్ 1 ఆప్ ద్వారా ప్రతి రోజు 4 అంశాలకు సంబంధించి రిపోర్టులు అప్ లోడు చేయాలన్నారు. ప్రతి రోజు ఇంటింటి నుండి వందశాతం చెత్త సేకరించాలని దీని పై పంచాయతీ సెక్రటరీ లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ప్రతి 15 రోజులకు ఒక్కసారి తప్పని సరిగా ఓవర్ హెడ్ టాంక్స్ ను క్లినింగ్ చేసి క్లోరినేషన్ చేయాలని,పైపులు లీకేజీ లేకుండా చూడాలని, వర్షాల వల్ల దోమలు అభివృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. ఈ కె వై సి చేయించుకోపోవడంతో కొందరికి తల్లికివందనం రాలేదని, అలాంటి వారిని గుర్తించి ఈ కె వై సి వెంటనే పూర్తి చేయించి వారికి తల్లి కి వందనం డబ్బులు తల్లుల ఖాతాకు జమ అయేలా చూడాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లా లో చేపట్టే సోక్ ఫిట్స్,కమ్యూనిటీ సోక్ ఫిట్స్ గుర్తించిన పనులు పెండింగ్ లేకుండా లక్ష్యాలను నిర్దేశించిన సమయాన్ని కల్లా పూర్తి చేయలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 5 న మన మిత్ర యాప్ కు సంబంధించి క్యాంపిన్ ప్రారంభించడం జరిగిందని, వాట్ షాప్ గవర్నర్ పై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి పూర్తి అవగాహన చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ క్యాంపు ఆఫీసు నుండి జూమ్ కాన్ఫరెన్స్‌లో డిపిఓ,డ్వామా పిడి పాల్గొన్నారు.

# మహమ్మారి వ్యాధులపై అవగాహన



**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 12 :** తిరుపతి జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాలయం ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి వారి ఆధ్వర్యంలో ఐఇసి ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్ ప్రారంభించి మహమ్మారి హెచ్ఐవి ఎయిడ్స్ పై మరియు మాధకద్రవ్య వ్యసనాలపై యువతకు అవగాహన నిర్మూలన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ ర్యాలీలో పాల్గొని, %×జుజ% కాంపెయిన్ యొక్క పోస్టర్ లను ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మరియు తిరుపతి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి డాక్టర్ శైలజ మాట్లాడుతూ హెచ్ఐవి పై ప్రతి ఒక్కరికి అవగాహన కావాలని వారి పట్ల ఎలాంటి వివక్షత చూపరాదని చెప్పడం జరిగింది. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ కోటి రెడ్డి మాట్లాడుతూ యువత కి హెచ్ఐవి/ఎయిడ్స్ మరియు మత్తు పదార్థాలకు బానిసలై సన్నిహితులతో కలిసి సిగరెట్టు, మందుకు అలవాటై, అలా గంజాయి వరకు కూడా వ్యసనాలకు బానిసలై జీవితం విచ్ఛిన్నం చేసుకుంటున్నారు. యువతకు హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహనతో పాటు ప్రతి కాలేజీలో కూడా కౌన్సిలింగ్ కార్యక్రమలు నిర్వహించడం చాలా మంచిదన్నారు.

## వాడవాడలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు



**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు 12 :** ప్రజల్లో దేశభక్తి ఉట్టిపడేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, పేర్కొన్నారు. మంగళవారం “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమాన్ని పురస్కరించుకొని టేక్కే మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీని రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో కలిసి జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ దేశమంతా ప్రజలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారని... ప్రతి ఒక్కరూ దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల జీవిత గాథలను గుర్తుచేసుకుని దేశ అభివృద్ధికి పనరంకితమవ్వాలని పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంలో కులాలు, మతాలు, విభిన్న జాతులు మమేకమై దేశ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ సత్సంకల్పంతో రాష్ట్ర ప్రధానమంత్రి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి ప్రతి ఒక్కరూ పాల్గొనేలా పిలుపునిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని సీఎం ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహెూత్సవంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుపుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే పట్టణంలో నిర్వహించిన భారత జాతీయ జెండా భారీ ర్యాలీలో వివిధ పాఠశాలల విద్యార్థులు, జిల్లాధికారులు ఉత్సాహంగా పాల్గొని దేశభక్తిని చాటుకోవడం సంతోషదాయకమన్నారు. దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకుంటున్న నేపథ్యంలో స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగనిరతిని, వారు దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. హర్ ఘర్ తిరంగా” కార్యక్రమంలో 100 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు జిల్లా అధికారులు కలిసి 100 మీటర్ల జాతీయా పతాకంతో టేక్కే మార్కెట్ యార్డ్ నుండి గాంధీ గాంధీ చౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టడం జరిగింది.

# అమ్మానాన్న పెళ్లి.. లవర్ తో ఐదుగురు పిల్లల ఫుట్ బాల్ స్టార్ వివాహం



**హైదరాబాద్ పెన్ పవర్:** అతడు తరానికి ఒకడులాంటి ఫుట్ బాల్ ప్లేయర్... జట్టంతా ఒకెత్తయితే అతడు ఒక్కడే ఒక ఎత్తు.. ప్రపంచ కప్ లు గెలవకున్నా, ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్న సూపర్ స్టార్. తన స్టయిల్ అయితే.. ప్రపంచంలోని అందరు క్రీడాకారులకు పెద్ద ఆకర్షణ.. ఇక అమ్మాయిలైతే పడి చచ్చిపోతారు..! అలా ఎంతో ఇష్టపడిన ఓ అమ్మాయిని అతడు కూడా ఇష్టపడ్డాడు. దాదాపు పదేళ్లుగా ఇద్దరూ సహజీవనం సాగిస్తున్నారు.

**అతడి పేరే ఓ మంత్రం**

క్రిస్టియానో రొనాల్డో.. ప్రపంచ ఫుట్ బాల్ లో అతడి పేరే ఒక మంత్రం..! ఇప్పుడు అతడి వయసు 40. పోర్చుగల్ జట్టుకు 2003 నుంచి ఆడుతున్నాడు. సుదీర్ఘకాలం కెప్టెన్ కూడా. అయితే, పోర్చుగల్ కంటే వివిధ ఫుట్ బాల్ లీగ్ లకు ఆడుతూ అత్యంత విజయవంతం అయ్యాడు. తమ దేశానికి ప్రపంచ కప్ మాత్రం అందించలేకపోయాడు. కారణం.. పోర్చుగల్ జట్టులో రొనాల్డోకు దగ్గరగా వచ్చే ఆటగాడు ఒక్కడు కూడా లేకపోవడం. ఫుట్ బాల్ వంటి ఆటలో ఒక్కడితో ఏం సాధ్యం కాదు. అందుకే పోర్చుగల్ ప్రపంచ విజేతగా నిలవలేకపోయింది. కానీ, రొనాల్డోకు మాత్రం ఎప్పటికీ ఆదరణ తగ్గలేదు.

**లీగ్ సూపర్ స్టార్**

ఇక ఈ తరంలో ప్రపంచ ఫుట్ బాల్ ను ఏలిన ఆటగాళ్లలో ఒకరు రొనాల్డో అయితే మరొకరు అర్జెంటీనా కెప్టెన్ లయోనల్ మెస్సీ. ఇద్దరిని పోలిక తెస్తూ అభిమానులు రెండు వర్గాలుగా చీలిపోయిన సందర్భాలు అనేకం. మరోవైపు రొనాల్డో ప్రస్తుతం సౌదీ ప్రొ లీగ్ లో అల్ నసర్ క్లబ్ తరఫున ఆడుతున్నాడు. మొత్తం 30 మ్యాచ్ లలో 25 గోల్స్ చేశాడు. మూడు గోల్స్ కు సాయం చేశాడు.

–రొనాల్డో 2016 నుంచి జార్జినా రొడ్రిగెజ్ తో ప్రేమలో ఉన్నాడు. తాజాగా వీరి ఎంగేజ్ మెంట్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జార్జినా డైమండ్ రింగ్ ధరించి రొనాల్డోతో ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. రొనాల్డో–జార్జినాకు ఇద్దరు పిల్లలుండగా, సరోగసీ ద్వారా ముగ్గురు పిల్లలున్నారు. త్వరలో వీరిద్దరూ పెళ్లి చేసుకోనున్నారు. 2026లో ఫుట్ బాల్ ప్రపంచ కప్ జరగనుంది. ఖతర్ లో 2022లో జరిగిన ప్రపంచ కప్ లో రొనాల్డోను కీలక సమయంలో పక్కనపెట్టారు. వచ్చే ప్రపంచ కప్ నాటికి రొనాల్డో పోర్చుగల్ జట్టులో ఉండడం అనుమానమే?

# ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటిన తర్వాత బోడ మల్లయ్య... మరోసారి సంచలన వ్యాఖ్యలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి పదవిపై మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యాలు రోజు రోజుకు వైరల్ గా మారుతున్నాయి. నిన్నటికి నిన్న 'రాజగోపాల్ కు మంత్రి పదవి ఇస్తామన్న మాట వాస్తవం. కానీ రాజకీయ సమీకరణాలతో ఇవ్వలేకపోయాం' అన్న భట్టి వ్యాఖ్యాలను ఎక్స్ లో పోస్ట్ చేసి రేవంత్ సర్కార్ ను విమర్శించిన రాజగోపాల్ రెడ్డి ఇప్పుడు మరో అంశంను తలకెత్తుకున్నారు. తనకు మంత్రి పదవి ఆఫర్ చేస్తేనే కాంగ్రెస్ లోకి వచ్చానని లేదంటే బీజేపీలోనే కొనసాగేవాడినని గతంలో చెప్పిన రాజగోపాల్ రెడ్డి అన్నదమ్ములు ఒక పార్టీలో ఉంటే ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వద్దని రాజ్యాంగంలో రాసుందా? అంటూ ప్రశ్నించరు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై పలువురు నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

తనకు మంత్రి పదవి ఇవ్వకుండా ఎవరు అడ్డుకుంటున్నారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలని ప్రశ్నించారు. తను పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత హైకమాండ్ తిరిగి ఆహ్వానించిందన్నారు. తనకు మంత్రి పదవి హామీ ఇస్తేనే వచ్చినట్లు చెప్పిన ఆయన ఇప్పుడు తన సోదరుడు వెంకట్ రెడ్డికి మంత్రి పదవి ఉందని తనకు ఇవ్వకుండా ఉండడం సరికాదన్నారు. వెంకట్ రెడ్డి నేను అన్నదమ్ములమని అప్పుడు వారికి తెలియదా..? అని ప్రశ్నించారు. ఇద్దరు సమర్థవంతమైన నేతలని పెద్దలకు తెలిసిందే కదా అన్నారు. అలాంటప్పుడు ఇద్దరికి మంత్రి పదవి ఇస్తే ఏమవుతుందని నిలదీశారు. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి దాదాపు మూడేళ్లు కావస్తుందని అయినా తాను వేచి చూస్తానని మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటిన తర్వాత బోడ మల్లయ్య.. లాగా హైకమాండ్ హామీ ఉందని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను తీసుకున్న హైకమాండ్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా తనకు మంత్రి పదవిపై గట్టి హామీ ఇచ్చిందని తెలిపారు. కేవలం 9 నియోజకవర్గాలు ఉన్న ఖమ్మంకు ముగ్గురు మంత్రులను కేటాయించారు.. అలాంటిది 11 నియోజకవర్గాలు ఉన్న నల్గొండకు ముగ్గురు మంత్రులు ఉంటే తప్పేంటి అంటూ ప్రశ్నించారు. గతంలో భువనగిరి ఎంపీగా చేశాను. నల్గొండకు ఎమ్మెల్సీ చేశాను. ఇప్పటికే మునుగోడు వెనుకబడి ఉంది. అభివృద్ధి చేయాలంటే నిధులు కావాలని, అందుకే తాను మంత్రి పదవి ఆశిస్తున్నట్లు చెప్పుకచ్చారు.

ఏది ఏమైనా రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి లొల్లి ప్రభుత్వాన్ని రోజుకో చిక్కులో నెడుతోంది.

# ప్రాపర్టీ ట్యాక్స్-2025లో మార్పులు ఇవే.. ఇక చెల్లింపులు మరింత సులభం..

**హైదరాబాద్ పెన్ పవర్:** నరేంద్రమోడీ కేంద్రం పగ్గాలు చేపట్టిన తర్వాత చాలా చట్టాలను మారుస్తూ వస్తుంది. బ్రిటీష్ కాలం నుంచి వస్తున్న అనేక చట్టాల్లో అనేక మార్పులు తెచ్చి కొన్నింటిని సైతం తొలగించింది. న్యాయ వ్యవస్థ పేరు ఇండియన్ పీనల్ కోడ్ ను మార్చి భారత న్యాయ సంహిత పేరును తీసుకువచ్చింది. అలాగే అందులోని చట్టాలను కూడా మార్పులు, సవరణలు చేపట్టింది. ఇందులో భాగంగా మరో చట్టాన్ని సవరించేందుకు మోడీ కేబినెట్ శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సితారామన్ నిన్న (ఆగస్ట్ 11) లోక్ సభలో కొత్త ఆదాయపు పన్ను బిల్లు–2025ను ప్రవేశపెట్టింది. దీన్ని సభ కేవలం మూడు నిమిషాల్లోనే ఆమోదించింది.


**ఇప్పటికే లోక్ సభ ఆమోదం..**

లోక్ సభలో ఆమోదం పొందిన తర్వాత రాజ్యసభకు వెళ్లి అక్కడ కూడా ఆమోదం పొంది, రాష్ట్రపతి సంతకం అనంతరం చట్టంగా మారి అమలవుతుంది. ఈ బిల్లు 1961 ఆదాయపు పన్ను బిల్లును పూర్తిగా మార్చబోతోంది. ఈ బిల్లులో ప్రాపర్టీ టాక్స్ కు సంబంధించి మార్పులు ఉంటాయని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి.

**చాలా సమస్యలకు పరిష్కారం..**

1961లో చేసిన బిల్లలో 30 శాతం తగ్గింపును ఉంటే దాన్ని ఎప్పుడు క్లయిమ్ చేయాలో స్పష్టంగా వివరించలేదు. ఇప్పుడు చేసిన బిల్లులో దాన్ని మార్చారు. ఆదాయపు పన్ను ట్టం 1961లో 23, 24 సెక్షన్లను మరింత స్పష్టంగా చెప్పాలి. నిర్మాణానికి సంబంధించిన వడ్డీ (ఇల్లు నిర్మించే ముందు చెల్లించే రుణానికి సంబంధించిన వడ్డీ) కోసం మినహాయింపు ఉంటుంది. ఇది సొంత ఇంటికి అయినా లేదా అద్దె ఇంటికైనా వర్తిస్తుంది. నిరుపయోగంగా ఉన్నా.. చాలా కాలం ఖాళీగా ఉన్న వ్యాపార ఆస్తులపై ఎలాంటి పన్ను ఉండదు. ఇంటి నుంచి వచ్చే ఆదాయం వృత్తి పరంగా ఉపయోగిస్తేనే పన్ను ఉంటుందని క్లాజ్ 20 చెప్తుంది. ఇక పోతే పన్ను స్లాబ్ విధానంలో ఎలాంటి మార్పు లేదు. గతంలో లాగానే ఇప్పుడు కూడా ఉంది.

# వైసీపీలో ప్రయోగాలు.. విషయం ఇదీ.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిపక్షం వైసీపీలో ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి. నియోజకవర్గాల్లో మార్పుల నుంచి జిల్లాల ఇంచార్జిల వరకు ఈ మార్పులు కొనసాగుతున్నాయి. ఏడాది కిందట ఎన్నికల అనంతరం మార్పులు చేసిన పార్టీ అధినేత జగన్.. ఇప్పుడు మరోసారి మార్పుల దిశగా అడుగులు వేస్తున్నారు. దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయని తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. వీటి కారణంగానే మరోసారి పార్టీలో మార్పులు జరుగుతున్నాయని అంటున్నారు. గత 10 మాసాల కిందట జరిగిన మార్పుల్లోనూ ఇప్పుడు కొన్ని తీసివేతలు ఉంటాయని చెబుతున్నారు.

**ప్రధానంగా ఇవీకారణాలు:**

1) నియోజకవర్గాల్లో నేతలపై పట్టు లేకపోవడం: ప్రస్తుతం నియోజకవర్గాల్లో ఇంచార్జ్లుగా ఉన్న నాయకులకు పట్టు లేదన్న టాక్ వినిపిస్తోంది. ఉదాహరణకు విజయవాడ పశ్చిమలో గత ఎన్నికల సమయంలో ఆసిఫ్కు అవకాశం ఇచ్చారు. కానీ, ఆయన పుంజుకోలేక పోతున్నారు. బలం ఎక్కడా కనిపించడం లేదు. ఇక, ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోనూ.. పరిస్థితి ఇలానే ఉంది. నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి ఇక్కడ పుంజుకోలేక పోతున్నారు. ఇలా.. ఉన్న నియోజకవర్గాల్లో మార్పులు చేయనున్నారు.

2) పాతవారికే ఛాన్స్: ప్రస్తుతం నియోజకవర్గాల్లో చాలా చోట్ల ఇంచార్జ్లు లేరు. గత ఎన్నికల్లో చేసిన మా ర్పుల కారణంగా.. నియోజకవర్గాలపై ప్రభావం పడింది. నేతలను ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మార్పు చేసిన ఫలితంగా.. రెండు చోట్లా పార్టీ పట్టు పోగొట్టుకుంది. ఈ క్రమంలో ఇప్పుడు పాతవారికే తిరిగి వారి వారి నియోజకవర్గాలను అప్పగించనున్నారు. తద్వారా తిరిగి బలమైన నియోజ కవర్గాలు సాధించేలా ప్లాన్ చేస్తున్నారు. సుమారు 50 నియోజకవర్గాల్లో పాతవారికే ఛాన్స్ చిక్కనుంది. ఇదే సమయంలో అభ్యర్థులు లేని నియోజకవర్గాల్లో కొత్త వారికి ఛాన్స్ ఇవ్వనున్నారు.

3) జిల్లాల ఇంచార్జ్లు: ప్రస్తుతం జిల్లాలకు ఉన్న ఇంచార్జ్ల పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. కొందరు బాగానే పనిచేస్తున్నా.. మరికొందరు వెనుకబడుతున్నారు. వీరిపై ఇప్పటికే రిపోర్టులు తెప్పించుకున్న పార్టీ అధినేత మార్పులు, చేర్పుల దిశగా అడుగులు వేయాలని నిర్ణయించారు. తద్వారా యాక్టివ్గా ఉండే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలానే.. జిల్లాల నేతలపై కూడా ప్రత్యేకంగా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయనున్నారు. తద్వారా జిల్లాల్లో జరుగుతున్న రాజకీయాలపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడంతోపాటు వాటిని కంట్రోల్ కూడా చేయనున్నారు.

# చైనాపై వెనక్కి తగ్గిన ట్రంప్.. భారత్ పై ఎందుకంత పగ?



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలు, ముఖ్యంగా ఇతర దేశాలపై సుంకాల విధింపు విషయంలో చాలా వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నారు. చైనా, భారత్ల పట్ల ఆయన అనుసరించిన వైఖరిలో స్పష్టమైన తేడా కనిపించింది. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ట్రంప్ పదేపదే గడువు పొడిగిస్తూ మెతక వైఖరిని ప్రదర్శించగా, రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తుందనే కారణంతో భారత్పై అదనపు సుంకాలు విధించడానికి సిద్ధమయ్యారు. ఈ వైరుధ్యానికి గల కారణాలను తెలుసుకుందాం.

**చైనా పట్ల ట్రంప్ వైఖరి**

ట్రంప్ చైనాను ప్రధాన వాణిజ్య ప్రత్యర్థిగా పరిగణించారు. చైనా వస్తువులపై భారీ సుంకాలు విధించి "ట్రేడ్ వార్" ప్రారంభించారు. అయినప్పటికీ, ఈ యుద్ధాన్ని ముగించి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ట్రంప్ ఆసక్తి చూపారు. దీనికి ప్రధాన కారణాలున్నాయి.

చైనా అమెరికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటి. అక్కడ వస్తువులను అమ్ముకోవడానికి అమెరికా కంపెనీలు ఆసక్తి చూపేవారు. అందుకే, ట్రేడ్ వార్ను కొనసాగించడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం వాటిల్లుతుందని ట్రంప్ భావించి ఉండవచ్చు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ చెప్పినట్లుగా, చైనాతో అమెరికా సంబంధాలు కేవలం చమురు కొనుగోళ్లపై ఆధారపడలేదు. మేధో సంపత్తి హక్కుల దొంగతనం, వాణిజ్య లోటు, దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తతలు వంటి అనేక సంక్లిష్ట సమస్యలు ఈ సంబంధాలను ప్రభావితం చేస్తాయి. వీటి పరిష్కారానికి చర్చలు అవసరమని ట్రంప్ గుర్తించారు. చైనాతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ద్వారా తన ఒక విజయంగా చెప్పుకోవచ్చని ట్రంప్ భావించి ఉండవచ్చు.

**భారత్పై కఠిన వైఖరికి కారణాలు**

చైనాతో పోలిస్తే, భారత్పై ట్రంప్ చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు.. భారత్ రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తోందనే కారణాన్ని ప్రధానంగా చూపించి సుంకాలు పెంచేందుకు ప్రయత్నించారు. దీని వెనుక ఉన్న కారణాలున్నాయి. ఉక్రెయిన్పై రష్యా దాడి తరువాత, అమెరికా రష్యాపై ఆర్థిక ఆంక్షలు విధించింది. రష్యా నుండి చమురు కొనుగోలు చేయవద్దని ఇతర దేశాలను కోరింది. అయితే, తన దేశీయ అవసరాల కోసం భారత్ రష్యా నుండి చమురు కొనుగోళ్లను కొనసాగించింది. ఇది అమెరికా విధానాలకు విరుద్ధంగా ఉండటంతో ట్రంప్ అసంతృప్తి చెందారు. భారత్తో అమెరికాకు వాణిజ్య లోటు ఉంది. దీనిని తగ్గించుకోవడానికి ట్రంప్ ప్రయత్నించేవారు. అందుకే, సుంకాలు విధించడం ద్వారా భారత్ను లొంగదీసుకుని తమకు అనుకూలంగా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని చూశారు. అమెరికాలో ట్రంప్కు మద్దతు ఇచ్చే వర్గాలలో రష్యా వ్యతిరేకులు ఎక్కువగా ఉన్నారు. భారత్పై కఠినంగా వ్యవహరించడం ద్వారా దేశీయంగా వారికి మద్దతు లభిస్తుందని ట్రంప్ భావించి ఉండవచ్చు.

ట్రంప్ విధానాలు అన్నీ కూడా "అమెరికా ఫస్ట్" అనే నినాదం ఆధారంగానే ఉండేవి. చైనాతో వాణిజ్య ఒప్పంద చర్చల గడువును పొడిగించడం వెనుక పెద్ద వాణిజ్య భాగస్వామ్యాన్ని నిలుపుకోవాలనే ఆలోచన ఉండవచ్చు. అదే సమయంలో భారత్తో వాణిజ్య సంబంధాలు అంత సంక్లిష్టం కాదని, సుంకాల ద్వారా సులభంగా ఒత్తిడి తీసుకురావచ్చని ట్రంప్ భావించి ఉండవచ్చు. ఏదేమైనా, ఒకే రకమైన చర్యలకు (రష్యా నుంచి చమురు కొనుగోలు) రెండు వేర్వేరు దేశాలపై విభిన్నమైన వైఖరిని ప్రదర్శించడం ఆయన విధానాల్లోని వైరుధ్యాన్ని స్పష్టం చేస్తుంది.

# బిహార్ ఓట్ల లెక్కలతో సిద్ధంగా ఉండండి.. ఈసీకి సుప్రీం అల్టిమేటం



**హైదరాబాద్ పెన్ పవర్:** మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న బిహార్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రాజకీయ మంటలు రేపిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నెల 1నే ముసాయిదా ప్రకటించగా.. ఆ లెక్కలు చూసిన ప్రతిపక్షాలు తమ ఆరోపణలకు పదును పెట్టాయి. బిహార్ అంటేనే కాస్త వ్యవస్థల పట్ల అపనమ్మకం. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వెలువడింది. నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్ల నుంచి ముసాయిదాలో 7.24 కోట్లకు తగ్గింది. అక్టోబరు–నవంబరులో ఎన్నికలు ఉండే అవకాశం ఉన్న బిహార్ లో సెప్టెంబరు 30న తుది జాబితాను ప్రకటించనున్నారు.

**ఈసీ నిర్ణయంపై సవాల్...**

మహారాష్ట్ర ఎన్నికల్లో తమకు అనుకూల వాతావరణం ఉన్నప్పటికీ దారుణ ఓటమిపాలైన ఇండియా కూటమికి బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఓ ఆయుధంగా మారింది. ఓట్ల అవకతవకలతోనే తాము మహారాష్ట్ర సహా లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయామంటున్న ఇండియా కూటమి పార్టీలు ఇప్పుడు బిహార్ లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశాయి. వీటిని విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. సరైన వివరాలు, అన్ని గణాంకాలతో సిద్ధంగా ఉండాలంటూ ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.

**బతికున్న 12 మంది చనిపోయినట్లు..**

బిహార్ ప్రధాన ప్రతిపక్షం ఆర్జేజీ నాయకుడు మనోజ్ ఝా వేసిన పిటిషన్ పై ఆయన తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ఓ నియోజకవర్గంలో 12 మంది బతికి ఉన్నవారిని చనిపోయినట్లుగా చూపారని తెలిపారు. కొన్నిచోట్ల చనిపోయినవారిని బతికున్నట్లు చూపారని పేర్కొన్నారు. అయితే, ఇవన్నీ తప్పిదాలని, సహజంగా జరిగేవే అని ఈసీ తరఫున న్యాయవాది రాకేశ్ ద్వివేది తెలిపారు. బిహార్ లో ప్రకటించినది ముసాయిదా మాత్రమేనని పేర్కొన్నారు.

ఇరుపక్షాల వాదలన అనంతరం సుప్రీం కోర్టు ధర్మాసనం స్పందిస్తూ.. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఈసీకి సూచించింది. ఈ క్రమంలో ఎస్ఐఆర్ కు ముందు ఎందరు ఓటర్లున్నారు? గతంలో నమోదైన మరణాల సంఖ్య, ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్యలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది.

కాగా, ఎస్ఐఆర్ అంశంపై గత నెలలో సుప్రీం స్పందించింది. మూకుమ్మడిగా ఓట్లను తొలగిస్తే తాము వెంటనే జోక్యం చేసుకుంటామని తెలిపింది. గత నెల 10న విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ఆపేందుకు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో ఓటరు ఐడీలను ప్రాథమిక పత్రాలుగా తీసుకోవాలని సూచించింది.

# అసలైన జాక్ పాట్ చెన్నైదే.. 9 ఐపీఎల్ జట్లను విమర్శించిన డివిలియర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా చిచ్చర పిడుగు డెవాల్డ్ బ్రెవిస్ ఆస్ట్రేలియాపై సునామీ ఇన్నింగ్స్ ఆడాడు. ఆడుతుంది ఆస్ట్రేలియా గడ్డపై అయినా వెనక్కి తగ్గలేదు. మంగళవారం (ఆగస్టు 12) డార్విన్ వేదికగా మర్రారా క్రికెట్ గ్రౌండ్ లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టీ20లో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ సఫారీ కుర్రాడు ఆకాశమే హద్దుగా చెలరేగి సెంచరీ చేశాడు.మొదట కాస్త ఆచితూచి ఆడిన ఈ సఫారీ 22 ఏళ్ళ కుర్రాడు ఆ తర్వాత ఓ రేంజ్ లో కంగారులపై విరుచుకుపడ్డాడు. 25 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్న బ్రెవిస్.. ఆ తర్వాత మరింత రెచ్చిపోయి 41 బంతుల్లోనే తన అంతర్జాతీయ కెరీర్ లో తొలి సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఓవరాల్ గా 56 బంతుల్లో 12 ఫోర్లు, 8సిక్సర్లతో 125 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ సెంచరీతో ప్రపంచానికి తాను ఎంత ప్రమాదకర బ్యాటర్ అనే విషయాన్ని చెప్పాడు.

బ్రెవిస్ ఆటకు ఏబీ డివిలియర్స్ ఫిదా అయ్యాడు. ఈ 22 ఏళ్ళ యువ క్రికెటర్ పై ప్రశంసలు కురిపించాడు. ఈ సఫారీ ఆటగాడిని నిర్లక్ష్యం చేసినందుకు ఐపీఎల్ జట్లను విమర్శించాడు. బ్రెవిస్ తో ఒప్పందం కుదుర్చుకునే సువర్ణావకాశాన్ని 9 ఐపీఎల్ జట్లు కోల్పోయాయని.. ఏ విషయంలో చెన్నై సూపర్ కింగ్స్ చాలా లక్కీ అని డివిలియర్స్ తెలిపాడు. "వేలంలో డెవాల్డ్ బ్రెవిస్‌ను తీసుకోవడానికి ఐపీఎల్ జట్లకు సువర్ణావకాశం వచ్చింది. ఒక్కరు కూడా అతనిపై ఆసక్తి చూపించకుండా బ్రెవిస్ ను మిస్ చేసుకున్నారు. CSK చాలా లక్కీ. బహుశా ఇప్పటివరకు ఇదే అతిపెద్ద మాస్టర్ స్ట్రోక్ కావచ్చు". అని డివిలియర్స్ తన ఎక్స్ ద్వారా రాసుకొచ్చాడు.

ఐపీఎల్ 18 ఎడిషన్?లో దారుణంగా విఫలమవుతోన్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు బ్రెవిస్ వరంలా దొరికాడు. జూనియర్ ఏబీ డివిలియర్స్‌గా

పేరుగాంచిన డెవాల్డ్ బ్రెవిస్ ను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు దక్కించుకుంది. మెగా ఆక్షన్ లో ఒక్కరు కూడా ఆసక్తి చూపించకపోయినా చెన్నై ఐపీఎల్ 2025 సీజన్ మధ్యలో తీసుకొని జాక్ పాట్ కొట్టేసింది. చెన్నై జట్టులోకి చేరినప్పటి నుంచి ఈ సఫారీ యువ క్రికెటర్ ఓ రేంజ్ లో చెలరేగి ఆడుతున్నాడు. సూపర్ కింగ్స్ తరపున అద్భుతంగా ఆడి.. అదే ఫామ్ ను అంతర్జాతీయ క్రికెట్ లో కొనసాగిస్తున్నాడు.

# గిల్‌నే వరించిన ఐసీసీ అవార్డు.. స్టోక్స్, ట్రిపుల్ సెంచరీ వీరుడిని ఓడించిన టీమిండియా కెప్టెన్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా నయా టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ అరుదైన ఘనత సాధించాడు. 2025 జూలై నెలకు గానూ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్? అవార్డు గెలుచుకున్నాడు. ఇంగ్లాండ్ తో ఇటీవలే జరిగిన ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో అద్భుతంగా రాణించిన గిల్ ను ఐసీసీ అవార్డు వరించింది. ఈ అవార్డు కోసం నామినీలుగా ఎంపికైన ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్, సౌతాఫ్రికా దక్షిణాఫ్రికా ఆల్ రౌండర్ వియాన్ ముల్డర్ ను టీమిండియా టెస్ట్ కెప్టెన్ ఓడించాడు. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు గెలుచుకోవడం గిల్ కెరీర్ లో ఇది నాలుగోసారి. ఫిబ్రవరి 2025, జనవరి 2023, సెప్టెంబర్ 2023లో శుభమాన్ కు ఈ అవార్డు దక్కింది.

జూలై నెలలో గిల్ పెర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంది. ఈ నెలలో ఆడిన మూడు టెస్టుల్లో 94.50 యావరేజ్ తో 567 పరుగులు చేశాడు.

ఆరు ఇన్నింగ్స్‌లలో ఒక డబుల్ సెంచరీతో పాటు రెండు సెంచరీలు ఉన్నాయి. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన రెండో టెస్టులో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ టెస్టులో రెండు ఇన్నింగ్స్ ల్లో కలిపి గిల్ 430 పరుగులు చేయడం విశేషం. సౌతాఫ్రికా ఆల్ రౌండర్ ముల్డర్ జింబాబ్వే పై 367 పరుగులు చేసి ఈ రేస్ లో నిలవగా.. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఇండియాతో జరిగిన టెస్ట్ సిరీస్ లో ఆల్ రౌండ్ షో తో మెప్పించిన అవార్డు సొంతం చేసుకోలేకపోయారు. మెన్స్ క్రికెట్ లో ఎక్కువగా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను గెలుచుకున్న ప్లేయర్ గా గిల్ రికార్డ్ సృష్టించాడు. "జూలై నెలకు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈ సారి కెప్టెన్‌గా నా తొలి టెస్ట్ సిరీస్‌లో నా పెర్ఫార్మెన్స్ కారణంగా ఈ అవార్డు రావడం గర్వంగా అనిపిస్తోంది. బర్మింగ్‌హామ్‌లో డబుల్ సెంచరీ నేను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నా ఇంగ్లాండ్ టూర్ లో ఈ ఇన్నింగ్స్ హైలెట్ గా నిలుస్తుంది". అని ఐసీసీ మీడియా ప్రకటనలో గిల్ అన్నాడు. మహిళా విభాగంలో ఇంగ్లాండ్ ప్లేయర్ సోఫియా డంక్లీ మహిళా ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు గెలుచుకుంది.

# రేకుల షెడ్డు మనస్తత్వం... ధోనీ గురించి రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు




- ధోని ప్రశాంత స్వభావంపై రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు
- రాయుడి కోపాన్ని రేకుల షెడ్డుతో పోల్చిన ధోని
- అంపైర్లతో వాదించొద్దని తనకు సలహా ఇచ్చేవాడన్న రాయుడు
- ఓ మ్యాచ్‌లో ధోనీనే మైదానంలోకి వచ్చి అంపైర్లతో వాదించాడని వెల్లడి
- ధోని సారథ్యంలో సీఎస్కే ఐదుసార్లు ఐపీఎల్ విజేత


**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోని ప్రశాంత స్వభావం గురించి అందరికీ తెలిసిందే. అయితే, మైదానంలో అతని నాయకత్వ పటిమ, సహచర ఆటగాళ్లతో వ్యవహరించే తీరుపై సీఎస్కే మాజీ ఆటగాడు అంబటి రాయుడు కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. తన కోపాన్ని ఉద్దేశించి ధోని సరదాగా చేసిన ఓ వ్యాఖ్యను రాయుడు గుర్తుచేసుకున్నాడు.ధోని నాయకత్వంలో తన అనుభవాల గురించి మాట్లాడుతూ, "రేకుల షెడ్డు చాలా త్వరగా వేడెక్కినట్లే, నీకు కూడా వెంటనే కోపం వచ్చేస్తుంది," అని ధోని తనతో చమత్కరించేవాడని రాయుడు వెల్లడించాడు.

తాను కొన్నిసార్లు ఉద్వేగాన్ని అదుపు చేసుకోలేకపోయేవాడినని, అలాంటి సమయాల్లో ధోని తనను హెచ్చరించేవాడని తెలిపాడు. "నువ్వు బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టు. అనవసరంగా చేతులు ఊపొద్దు. నీ వల్ల మనం ఫెయిర్ ప్లే పాయింట్లు కోల్పోవడం నాకు ఇష్టం లేదు" అని ధోని చెప్పేవాడని రాయుడు పేర్కొన్నాడు.అయితే, ఎప్పుడూ శాంతంగా ఉండమని చెప్పే ధోనీనే ఒకసారి తన నియంత్రణ కోల్పోయిన సంఘటనను రాయుడు గుర్తుచేసుకున్నాడు. "ఆసక్తికరంగా, అదే ఏడాది ఓ మ్యాచ్‌లో చెన్నై ఓటమి అంచున ఉన్నప్పుడు, నేను సంయమనం పాటించాను కానీ, ధోనీయే స్వయంగా మైదానంలోకి దూసుకొచ్చి అంపైర్లతో వాదించాడు" అని రాయుడు వివరించాడు

కాగా, ఐపీఎల్ చరిత్రలో ధోని సారథ్యం చెన్నై సూపర్ కింగ్స్‌కు తిరుగులేని ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 2008లో ఫ్రాంచైజీ మొదలైనప్పటి నుంచి ధోని నాయకత్వంలో సీఎస్కే జట్టు 10 సార్లు ఫైనల్స్‌కు చేరి ఐదు సార్లు ఛాంపియన్ గా నిలిచింది. 2010, 2011, 2018, 2021, 2023 సంవత్సరాల్లో ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఇది కాకుండా, 2010, 2014 సంవత్సరాల్లో రెండుసార్లు ఛాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలను కూడా గెలుచుకుంది.

# 'బాహుబలి: ది ఎపిక్' ఫ్యాన్స్‌లో సందేహాలు

బాహుబలి -1, బాహుబలి -2 రెండు సినిమాలను కలిపి ఒకే సినిమాగా వీక్షించే అవకాశం ఉంటే మీరు థియేటర్‌కి వెళతారా? కట్టప్ప వెన్నుపోటు లాంటి ప్రశ్న ఇది! నిజానికి బాహుబలి కథను ఒకే సినిమాగా తెరపై చూడాలని చాలా మంది ఉత్సాహపడ్డారు. కానీ ఆ కల వారికి ఇప్పటికీ నెరవేరలేదు. ఎట్టకేలకు బాహుబలి -1, బాహుబలి -2 రెండు సినిమాలను మెర్జ్ చేసి ఒకే సినిమాగా వీక్షించేలా 4కే వెర్షన్ ని రెడీ చేసి రిలీజ్ కి సిద్ధం చేసారు. అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం %-%బాహుబలి- ది ఎపిక్%-% పేరుతో విడుదల కానుంది. ఈనెల 14న థియేటర్లలో విడుదలవుతున్న కూలీ లేదా వార్ 2 సినిమాను వీక్షించే ప్రేక్షకులు %-%బాహుబలి: ది ఎపిక్%-% టీజర్- ఫస్ట్ లుక్‌ను వీక్షించే అవకాశం ఉంది. బాహుబలి విడుదలై పదేళ్లు అయిన సందర్భంగా ఇప్పుడు ఒకే వెర్షన్ ని రిలీజ్ చేయడం ద్వారా మరోసారి ప్రజల్లోకి వెళుతున్నామని రాజమౌళి గతంలో తెలిపారు. తాజాగా 31 అక్టోబర్ రిలీజ్ తేదీతో రూపొందించిన స్పెషల్ పోస్టర్ లో ప్రభాస్ వర్సెస్ రానా లుక్ హైలైట్ గా కనిపిస్తోంది. సూర్యవంశపు రాజు బాహుబలి, అతడి సోదరుడైన భళ్లాల దేవుడిని ఈ పోస్టర్ లో చూపించారు. వార్ సమయంలో ఆ ఇద్దరి రౌద్ర రసాన్ని ఆవిష్కరిస్తూ అద్భుతమైన యాక్షన్ ఎపిసోడ్స్ ని రాజమౌళి తెరకెక్కించారు. ఇప్పుడు బాహుబలి- ది ఎపిక్ లో రెండు భాగాల సినిమాను ఒకే చిత్రంగా చూపించాలి గనుక చాలా సన్నివేశాలను తొలగించి ఉంటారని అంతా ఊహిస్తున్నారు.







ఆకుపచ్చ రంగులో ఉన్న రీగల్ రేడియన్స్ నిధి అగర్వాల్ యొక్క ఎత్నిక్ గాంభీర్యం

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com